PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 319 | విజయవాడ, సోమవారం 24 జూన్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 24 June 2024 | Rs

కేరళ ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ శాఖ మంత్రిగా ఒఆర్.కేలు

5



ఆఫ్ఘన్ అద్భుత విజయం

- సూపర్8లో ఆస్ట్రేలియాపై 21 పరుగులతో గెలుపు
- ఐసిసి 2024 టి20 ప్రపంచకప్

6

కౌలు రైతు గుర్తింపు ఎలా?

- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుతో సిసిఆర్‌సిపై చర్చ
- ఎల్ఇసిని తొలగించి కొత్త చట్టం తెచ్చిన వైసిపి సర్కార్
- టెనెంట్లను గుర్తించి పథకాలిస్తామని కూటమి మేనిఫెస్టోలో హామీ
- పాత పద్ధతే అయితే భరోసా మాదిరే ఆర్థిక సాయం వగైరా వగైరా
- నష్టపోనున్న వాస్తవ సాగుదారులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

వైసిపి సర్కారు తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుకు టిడిపి కూటమి ప్రభుత్వం రెండవ సంతకం చేసిన తరుణంలో గడచిన ఐదేళ్లలో కౌలు రైతులకు ఇబ్బందికరంగా తయారైన ఎపి పంట సాగుదారుల హక్కు చట్టం (సిసిఆర్‌సి) వైపునకు అందరి దృష్టి మళ్లింది. ఉమ్మడి రాష్ట్రంలో కౌలు రైతుల గుర్తింపు కోసం నాటి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణ అర్హత కార్డు (ఎల్ఇసి) చట్టాన్ని జగన్ సర్కారు వచ్చీరాగానే 2019 ఆగస్టులో రద్దు చేసి, అంతకంటే మెరుగైన చట్టం అంటూ సిసిఆర్‌సి చట్టాన్ని తీసుకొచ్చింది. కాగా తమ భూములను కౌలుకు ఇస్తున్నట్లు భూయజమానులు రాతపూర్వకంగా సమ్మతి తెలిపితేనే కౌలు రైతులు గుర్తింపు పొందుతారంటూ విధించిన నిబంధన కౌలు రైతుల యావజ్జీవాలూ కుంగదీసింది. వారి గుర్తింపునకు ఆటంకంగా మారింది. ల్యాండ్ ఓనర్లు ఆ విధంగా సంతకాలు పెట్టడానికి ముందుకు రానందున సిసిఆర్‌సిల జారీ నామమాత్రంగా జరిగింది. ఇచ్చిన గుర్తింపు కార్డులకు 11 మాసాల కాలపరిమితి విధించడం కౌల్దార్లను మరిన్ని అవస్థలపాల్జేస్తోంది.



వైసిపి తెచ్చిన సిసిఆర్‌సి చట్టం పట్ల పలు సందర్భాల్లో టిడిపి అసంతృప్తి వ్యక్తం చేసింది. మరోవైపు కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యపార్టీ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా కౌలు రైతుల సమస్యలను తరచు లేవనెత్తడంతోపాటు ఆత్మహత్యలు చేసుకున్న వారి కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. ప్రస్తుతం పవన్ కల్యాణ్ డిప్యూటి సిఎంగా ఉన్నారు. వైసిపి తెచ్చిన సిసిఆర్‌సి చట్టంలో కౌలు రైతులకు ఇబ్బందికరంగా ఉన్న అంశాలను తొలగించి సవరణ చట్టం చేస్తారా లేదా ఆ చట్టాన్ని పూర్తిగా రద్దు చేస్తారా అనే అంశంపై చర్చ సాగుతోంది.

సంక్షేమం అన్నారు!

టిడిపి-జనసేన ప్రకటించిన ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టోలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులందజేసి అన్ని సంక్షేమ పథకాలూ అందిస్తామని, పంటల బీమా వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. దాంతో కౌల్దార్ల గుర్తింపునకు అడ్డంకిగా ఉన్న సిసిఆర్‌సి చట్టాన్ని ఏం చేయబోతున్నారనే విషయంపై కౌలు రైతుల్లో ఉత్కంఠ నెలకొంది. మేనిఫెస్టో అమలులో భాగంగా రైతుల, యజమానుల భూములకు రక్షణ లేకుండా చేసే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుకు పూనుకున్న కూటమి సర్కారు, కౌలు రైతుల సంక్షేమాన్ని దెబ్బతీస్తున్న సిసిఆర్‌సి యాక్ట్‌పైనా స్పందించాలంటున్నారు.

ఎల్ఇసి నుంచి సిసిఆర్‌సి దాకా

కౌలు రైతుల సుదీర్ఘ పోరాటాల ఫలితంగా 2011లో అప్పటి కాంగ్రెస్ సర్కార్ ఎల్ఇసి చట్టం తెచ్చింది. భూయజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులను రెవెన్యూ అధికారులు గుర్తించాలని పేర్కొంది. రాష్ట్ర విభజన తర్వాత ఈ చట్టం అమల్లో ఉన్నప్పటికీ 2014-2019 మధ్య టిడిపి ప్రభుత్వం ఎల్ఇసి చట్టానికి సమాంతరంగా సాగు ధ్రువీకరణ పత్రాలను (సిఒసి) ప్రవేశపెట్టింది. సిఒసిలను వ్యవసాయాధికారులు జారీ చేయాలంది. దాంతో ఎల్ఇసి క్రమంగా నిర్వీర్యమైంది. ఎల్ఇసి, సిఒసిలు తక్కువగా జారీ కాగా, కొంత మందికే బ్యాంకులు రుణాలిచ్చాయి. 2019లో అధికారంలోకొచ్చిన వైసిపి సర్కారు మొత్తానికే ఎల్ఇసి చట్టాన్ని రద్దు చేసి, సిసిఆర్‌సి యాక్ట్ తెచ్చింది. ఈ ఐదేళ్లలో ఏడాదికి కార్డుల జారీ రెండు మూడు లక్షలకు మించలేదు. గరిష్టంగా ఏడాదికి లక్ష మందికి లోపే బ్యాంకులు అరకొరగా రుణాలిచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మంది కౌలు రైతులున్నారని ప్రభుత్వం అంగీకరి స్తూండగా, గుర్తింపు మాత్రం నామమాత్రంగా ఉంటోంది. భూమిలేని కౌలు రైతులు ఆరు లక్షల మంది ఉంటారని అంచనా. నవరత్నాల్లో భాగంగా వైసిపి అమలు చేసిన రైతు భరోసా పథకం కౌలు రైతులకూ వర్తింపజేశామని చెప్పి, ఆచరణలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకేనన్నారు. ఒసి కౌల్దార్లకు లేద'న్నారు. ఐదేళ్లల్లో ఒక్క ఏడాది కూడా లక్ష మందికి మించలేదు. గుర్తింపు లేక రుణాలు, సబ్సిడీ సీడ్, రాయితీపై ఉపకరణాలు, మిగతా 2లో

నీట్ (యుజి) పున:పరీక్షకు
48 శాతం మంది గైర్హాజరు



న్యూఢిల్లీ : నీట్ యుజి-2024 పరీక్ష పత్రం లీకేజీ, పరీక్ష నిర్వహణలో అక్రమాలు జరిగిన నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ).. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో గ్రేస్ మార్కులు పొందిన 1,563 మంది విద్యార్థులకు తిరిగి ఆదివారం నీట్ పరీక్ష నిర్వహించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ పరీక్షకు 48 శాతం మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఎన్‌టిఎ తెలిపిన వివరాల ప్రకారం..1563 మంది విద్యార్థుల్లో 813 మంది (52 శాతం) పరీక్షకు హాజరయ్యారు. 750 మంది (48 శాతం) హాజరు కాలేదు. ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హర్యానా, మేఘాలయ రాష్ట్రాలతోపాటు చండీగఢ్ కేంద్ర పాలిత ప్రాంతం పరిధిలో ఏడు పరీక్షా కేంద్రాల్లో నీట్ యుజి పరీక్షను పున్ష నిర్వహించారు. చండీగఢ్ నుంచి ఇద్దరు రాయాల్సి ఉన్నా గైర్హాజరయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లో 602 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా 311 మంది గైర్హాజరయ్యారు. మరో 291 మంది పరీక్ష రాశారు. హర్యానాలో 494 మందికి 287 మంది, మేఘాలయలో 466 మందికి 234 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

రంగంలోకి సిబిఐ

దేశవ్యాప్తంగా వివాదాస్పదమైన నీట్ ప్రవేశపరీక్ష అక్రమాలపై విచారణ చేపట్టేందుకు కేంద్ర దర్యాప్తు బృందం (సిబిఐ) రంగంలోకి దిగింది. ఈ వ్యవహారంలో విద్యాశాఖ ఆదేశాల మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సిబిఐ అధికారి ఒకరు ఆదివారం తెలిపారు. నీట్ పరీక్షలో అక్రమాలపై దర్యాప్తును సిబిఐకి అప్పగిస్తున్నట్లు కేంద్రం శనివారం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై నమోదైన ఇతర కేసులను కూడా స్వాధీనం చేసుకునే ప్రక్రియను ప్రారంభించామని ఆ అధికారి తెలిపారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు, అక్రమాల నేపథ్యంలో ఆదివారం జరగాల్సిన నీట్ పిజి ప్రవేశపరీక్షను వాయిదా వేసింది. ప్రతిపక్షాలు, విద్యార్థి సంఘాల ఆందోళనలతో కంటితుడుపు చర్యగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) డైరెక్టర్ జనరల్ సుబోధ్‌కుమార్‌ను తొలగించింది. ఆయన స్థానంలో రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ప్రదీప్ సింగ్ ఖరోలాను నియమించిన సంగతి తెలిసిందే.

మహారాష్ట్రలో ఇద్దరు అరెస్టు

నీట్ యుజి పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. బీహార్‌లో పులువురిని అరెస్టు చేసిన అనంతరం తాజాగా మహారాష్ట్రలో నాందేడ్ ఉగ్రవాద వ్యతిరేక బృందం (ఎటిఎస్) ఇద్దరు నిందితులను అరెస్టు చేసింది. ఈ కుంభకోణంతో ప్రమేయముందన్న అభియోగాలపై లాతూర్ జిల్లాలో సంజయ్ తుకారామ్ జయదేవ్, జలీల్ ఉమ్రాఖాన్ పటాన్ అనే ఇద్దరు ఉపాధ్యాయులను శనివారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎటిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది.

ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ స్కామ్‌లో విద్యా మంత్రి తప్పుకోవాల్సిందే!

- సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్

5

నేటి నుంచి పార్లమెంటు సమావేశాలు

- నేడు, రేపు సభ్యుల ప్రమాణ స్వీకారం
- 26న లోక్‌సభ స్పీకరు ఎన్నిక
- 27న ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నేటి నుంచి పద్దెనిమిదవ లోక్‌సభ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. సోమ, మంగళవారం లోక్‌సభకు ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుంది. దాని తరువాత 26న లోక్‌సభ స్పీకరు ఎన్నిక జరగనుంది. 27న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తారు. సోమవారం రాష్ట్రపతి భవన్‌లో లోక్‌సభ ప్రొటెం స్పీకరుగా మహతాబ్‌తో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణం చేయిస్తారు. మహతాబ్ తర్వాత పార్లమెంటు హౌస్‌కు చేరుకుని ఉదయం 11 గంటలకు లోక్‌సభను ప్రారంభిస్తారు. 18వ లోక్‌సభ తొలి సమావేశం సందర్భంగా ఇటీవల మరణించినవారికి సభ్యులు కొద్దిసేపు మౌనం పాటించడంతో ప్రక్రియ ప్రారంభమవుతుంది. దీని తరువాత లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ లోక్‌సభకు ఎన్నికైన సభ్యుల జాబితాను సభ టేబుల్‌పై ఉంచుతారు. లోక్‌సభకు ఎన్నికైన సభ్యుల చేత ప్రొటెం స్పీకరు భర్తృహరి మహతాబ్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తారు.

తొలుత లోక్‌సభ నాయకుడు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. తరువాత ప్యానెల్ ప్రొటెం స్పీకర్లు కొడికున్నిల్ సురేష్ (కాంగ్రెస్), టిఆర్ బాలు (డిఎంకె), రాధా మోహన్ సింగ్ (బిజెపి), ఫగ్గన్ సింగ్ కులస్తే (బిజెపి), సుదీప్ బందోపాధ్యాయ (టిఎంసి)లతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఆ తరువాత కేంద్ర మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించి, తరువాత రాష్ట్రాలకు చెందిన సభ్యులను అక్షర క్రమంలో తదుపరి రెండు రోజుల్లో ప్రమాణ స్వీకారం చేయిస్తారు.

జూన్ 26న స్పీకరు ఎన్నిక జరిగే వరకు సభా కార్యకలాపాలను నిర్వహించడంలో మిగతా 2లో

దోసపాడు అసైన్డ్ భూములు దళితులకే

- ఏలూరు జిల్లా జెసి కోర్టు తీర్పు
- ఫలించిన ఎనిమిదేళ్ల పోరాటం

'రైతు భరోసా' పెంపు హామీ అమలు చేయండి

- అచ్చెన్నకు ఎపి రైతు సంఘం లేఖ

ప్రజ్వల్ రేవణ్ణ సోదరుడు, ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణ అరెస్ట్

లోపలి పేజీలో..



గాయపడిన పాలస్తీనా పౌరుణ్ని బానెట్‌కు కట్టి ఊరేగిస్తున్న దృశ్యం

గాయపడిన పాలస్తీనా పౌరుణ్ణి వాహన బానెట్‌కు కట్టి ఊరేగింపు

- ఇజ్రాయిల్ సైన్యం దాష్టీకం
- సోషల్ మీడియాలో వైరల్

గాజా సిటీ: ఇజ్రాయిల్ సైన్యం దాష్టీకాలకు అడ్డు అదుపులేకుండాపోతోంది. తమ దాడుల్లో గాయపడిన ముజాహిద్ అజ్మీ అనే పాలస్తీనా పౌరుణ్ణి సైనిక వాహనం బానెట్‌కు కట్టి ఊరేగించడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వెస్ట్ బ్యాంక్‌లోని జునిన్‌పై ఇజ్రాయిల్ దాడి చేసిన తరువాత ఈ ఘటన చోటుచేసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా తెలిపింది. బాంబు దాడిలో గాయపడి నెత్తురోడుతున్న పాలస్తీనీయుని పట్ల అత్యంత అమానుషమైన రీతిలో ఇజ్రాయిల్ సైన్యం వ్యవహరించడంపై నెటిజెన్లు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. హమాస్ 'ఉగ్రవాదులపై' జరిపిన కాల్పుల్లో అజ్మీ గాయపడ్డాడని, అతను ఉగ్రవాది అన్న అనుమానం కలుగుతోందంటూ ఇజ్రాయిల్ సైన్యం తన చర్యను సమర్థించుకునే యత్నం చేసింది. అజ్మీని ఆసుపత్రికి తరలించేందుకు కుటుంబ సభ్యులు అంబులెన్స్ కోసం వెతుకుతుండగా, ఇంతలోనే ఇజ్రాయిల్ సైన్యం అక్కడికి వచ్చి అతణ్ణి సైనిక వాహనానికి కట్టి ఊరేగింపుగా తీసుకెళ్లిందని స్థానిక మీడియా తెలిపింది. ఇంత దారుణం జరిగినా అమెరికా కానీ, ఇతర పశ్చిమ దేశాలు కానీ దీనిని ఖండించకపోవడం గమనార్హం.

మావోయిస్టుల మందుపాతర పేలి ఇద్దరు జవాన్లు మృతి

సుక్మా : ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా ప్రాంతంలో మావోయిస్టుల మందుపాతర పేలి ఇద్దరు జవాన్లు మరణించారు. సుక్మా జిల్లా ఝుగర్‌గుండ ప్రాంతంలోని క్యాంప్ సిలిగేర్, టేకులగూడెం మధ్య జవాన్ల వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని మందుపాతర పేల్చారు. పేలుడు ధాటికి సైనిక వాహనం పూర్తిగా ధ్వంసమైంది. అందులోని జవాన్లందరూ తీవ్రగాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న సిఆర్‌పిఎఫ్, కోబ్రా బెటాలియన్ బందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నాయని పోలీసులు తెలిపారు. గాయపడినవారిని స్థానిక ఆసుపత్రికి తరలించగా, . చికిత్స పొందుతూ ఇద్దరు జవాన్లు చనిపోయారని, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందనిఎ ఎస్‌పి ఆకాశ్‌రావు తెలిపారు.. చనిపోయిన ఇద్దరు జవాన్లు కోబ్రా బెటాలియన్‌కు చెందిన డ్రైవర్ విష్ణు, కానిస్టేబుల్ శైలేంద్ర అని తెలిపారు. సైనికుల రాకపోకలను నిశితంగా పసిగట్టి పక్కా ప్రణాళికతో ఐఇడి మందుపాతర అమర్చి మావోయిస్టులు ఈ పేలుడుకు పాల్పడినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం సంఘటనా స్థలంలో భద్రతా బలగాలను మోహరించి ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భవనాల కూల్చివేత సరికాదు

- భూ కేటాయింపులపై సమీక్షించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



ప్రజాశక్తి- విజయవాడ

అక్రమ నిర్మాణాల పేరుతో భవనాల కూల్చివేత సరికాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు, రాష్ట్రానికి కీడు చేసే భూఅక్రమ కేటాయింపులు, దందాలపై సమీక్షించాలని కోరారు. అవినీతి కుంభకోణాలు జరిగాయని, వాటి నిగ్గు తేల్చాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం గత వైసిపి ప్రభుత్వం మాదిరి కాకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ప్రజానుకూలంగా పాలన సాగించాలని కోరారు. విజయవాడ ఎంబి భవన్‌లో రెండు రోజులపాటు జరిగిన ఎన్‌టిఆర్ జిల్లా సిపిఎం కార్యకర్తల శిక్షణా కార్యక్రమం చివరి రోజు ఆదివారం ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యాలయాన్ని అక్రమ నిర్మాణం పేరుతో అధికారులు శనివారం కూల్చివేశారన్నారు. చట్టబద్ధంగా కూల్చివేస్తే ప్రజలు హర్షిస్తారని, అలా కాకుండా కక్షతో వ్యవహరించారనే దానికి అవకాశం కల్పించే విధంగా అధికార యంత్రాంగం వ్యవహరించడం సమంజసం కాదని పేర్కొన్నారు. కోర్టు తీర్పు వచ్చే వరకు వేచి ఉండాల్సిందన్నారు. గతంలో ఇలాగే వైసిపి ప్రభుత్వం వ్యవహరించి అభాసు పాలైందని గుర్తు చేశారు. ఇలాంటి చర్యల వల్ల కక్ష సాధింపు రాజకీయాలు చేసినట్లు అవుతుందని, అలాంటి ఆస్కారం ఇవ్వొద్దని టిడిపి నాయకత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం డిఎస్‌సి ప్రకటించడం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయడం పట్ల మద్దతు తెలిపారు. రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం తన హామీలు నెరవేర్చడానికి, వారు అనుసరించే ప్రజా అనుకూల విధానాలకు సిపిఎం మద్దతు ఇస్తుందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలోను, మూడోసారి మోడీ అధికారానికి రావడంలోనూ టిడిపి తోడ్పాటు అందించడం పట్ల విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బలహీనంగా ఉన్న బిజెపికి ఊపిరి పోసిన ఘటన టిడిపిదేనని విమర్శించారు. మతోన్మాద మిగతా 2లో

అమెరికాలో దుండగుడి కాల్పుల్లో
బాపట్ల జిల్లా యువకుడు మృతి

ప్రజాశక్తి- కర్లపాలెం (బాపట్ల జిల్లా)

అమెరికాలో దుండగుడు జరిపిన కాల్పుల్లో బాపట్ల జిల్లా కర్లపాలెం మండలానికి చెందిన యువకుడు మృతి చెందారు. ఇందుకు సంబంధించి మృతుని కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... చిన్న రైతు కుటుంబానికి చెందిన యాజలి గ్రామంలోని దాసరి శ్రీనివాసరావు, తల్లి ధనలక్ష్మి దంపతుల ఏకైక కుమారుడు దాసరి గోపీకృష్ణ (32) బిటెక్ చదివారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేసేవారు. నెలకు లక్ష రూపాయలు వేతనం వచ్చేది. ఇంకా ఎక్కువ వేతనం వస్తుందని ఆశించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగ ప్రయత్నాల కోసం ఎనిమిది నెలల క్రితం అమెరికా (డల్లాస్)కు వెళ్లారు. ప్రస్తుతం అక్కడ సూపర్ మార్కెట్లో క్యాషియర్‌గా పార్ట్ టైం జాబ్ చేస్తున్నారు. అమెరికా కాలమాన ప్రకారం శనివారం మధ్యాహ్న సమయంలో గోపీకృష్ణ క్యాష్ కౌంటర్‌లో ఉండగా ఓ దుండగుడు వచ్చి నేరుగా తుపాకీతో ఆయనపై కాల్పులు జరిపాడు. అనంతరం సూపర్ మార్కెట్లోని ఓ వస్తువును తీసుకొని పరారయ్యాడు. తీవ్ర గాయాలతో అక్కడిక్కడే కుప్పకూలిన గోపీకృష్ణ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నాడు. ఈ ఘటన నేపథ్యంలో యాజలి గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.



దాసరి గోపీకృష్ణ (ఫైల్)

గోపీకృష్ణ మృతి పట్ల వి.ఎస్‌ఆర్ దిగ్భ్రాంతి

గోపీకృష్ణ అమెరికాలో దుండగుడి కాల్పుల్లో మృతి చెందడం పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇటీవల అమెరికా వెళ్లి ఒక స్టోర్‌లో పనిచేస్తున్న ఆ యువకుడిని తుపాకీతో కాల్చి హత్య చేశారని పేర్కొన్నారు. గోపీకృష్ణ మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేయడంతోపాటు వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. గోపీకృష్ణ మృతదేహాన్ని అతని స్వస్థలానికి చేర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

బెయిలు కోసం సుప్రీంను ఆశ్రయించిన కేజ్రీవాల్

న్యూఢిల్లీ : ఢిల్లీ ఎక్సైజ్ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ట్రయల్ కోర్టు జారీ చేసిన బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు మధ్యంతర స్టే విధించడాన్ని సవాలు చేస్తూ ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం నాడు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 20న ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఆ బెయిల్ ఉత్తర్వులు కోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేలోపే .. స్టే విధించాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఢిల్లీ హైకోర్టును కోరింది. ఇడి అభ్యంతరాలతో కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్‌పై స్టే విధిస్తూ ఢిల్లీ హైకోర్టు ఈ నెల 21న శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. తుది నిర్ణయం కోసం తదుపరి విచారణను మంగళవారం నాటికి వాయిదా వేసింది. దీంతో తన బెయిల్‌పై స్టేను సవాలు చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసినట్లు ఆప్ నేతలు తెలిపారు. ఆప్ జాతీయ కన్వీనర్ కూడా అయిన కేజ్రీవాల్‌ను సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 21న ఇడి అరెస్టు చేసింది. హైకోర్టు గనుక కేజ్రీవాల్ బెయిల్‌పై స్టే ఉత్తర్వులు జారీ చేయకపోయివుంటే గత శుక్రవారమే ఆయన తీహార్ జైలు నుంచి విడుదల కావాల్సివుండేది.

జగ్గయ్యపేటలో అతిసార విజృంభణ

- కొత్తగా తొమ్మిది కేసులు నమోదు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట, వత్సవాయి (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లాలో డయేరియా విజృంభిస్తోంది. అతిసార కారణంగా వాంతులు, విరేచనాలు ఎక్కువ కావడంతో జగ్గయ్యపేట పట్టణంతోపాటు వత్సవాయి మండలానికి చెందిన రోగులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటికే అతిసారతో నలుగురు మృతి చెందారు. తాజాగా ఆదివారం తొమ్మిది మంది అతిసార బారినపడ్డారు. వారిలో జగ్గయ్యపేటకు చెందిన సాత్విక్, ఎం.నాగేశ్వరావు, కె.ధనుష్, వి.నర్సమ్మ, అర్.వేణుగోపాల్‌రెడ్డి, అర్.అన్నపూర్ణరెడ్డి, జాన్‌బాషా, వత్సవాయికి చెందిన ఉదయ భాస్కర్, సూర్యపేట జిల్లాకు చెందిన భవానీ జగ్గయ్యపేట, విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిల్లో చేరి చికిత్స పొందుతున్నారు. ఒక్క జగ్గయ్యపేట నియోజకవర్గంలోనే ఇప్పటికే మొత్తం 58 కేసులు నమోదవ్వగా 38 యాక్టివ్ కేసులు ఉన్నాయని డిఎంహెచ్ఓ సుహాసిని తెలిపారు. ఆదివారం ముగ్గురు డిశ్చార్జ్ అయ్యారని, ఒకరిని విజయవాడ ఆంధ్ర ఆస్పత్రికి, మరో ఏడుగురిని విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశామని తెలిపారు.

బాధితులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

డయేరియా వ్యాప్తి నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జగ్గయ్యపేటలో పర్యటించారు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, మాజీ మంత్రి నెట్టెం రఘురాంతో కలిసి ఆయన పరామర్శించారు. అతిసార బారిన పడటానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతని, ఆస్పత్రికి వచ్చిన బాధితులకు సకాలంలో వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

జగ్గయ్యపేటలోని షేర్ మహమ్మద్‌పేట, మక్కపేట తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. నీటి సమస్య కారణంగా డయేరియా విస్తరిస్తున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోందని, ప్రజలు అవగాహనతో ఉండాలని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు.

నేడు మంత్రివర్గ సమావేశం

- శ్వేతపత్రాలు, డిఎస్‌సిపై చర్చ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సోమవారం జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలోని మొదటి అంతస్తులో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం జరగనుంది. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత జరగనున్న తొలి మంత్రివర్గ సమావేశం. ఈ సమావేశంలో మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌పై చర్చ జరగనుంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత చంద్రబాబు 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై తొలి సంతకం చేసిన విషయం తెలిసిందే. ఈ నోటిఫికేషన్ విడుదలకు సంబంధించిన అంశాలపై మంత్రివర్గంలో చర్చించనున్నారు. రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచిన సామాజిక పింఛన్ల పెంపుపై కూడా చర్చ జరగనుంది. అదేవిధంగా శాఖలవారీ విడుదల చేయాల్సిన శ్వేతపత్రాలపైనా చర్చ జరిగే అవకాశం ఉంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు, విద్యుత్ ప్రాజెక్టులతో పాటు 8 శాఖలకు సంబంధించిన శ్వేతపత్రాలపై చర్చ జరగనున్నట్లు తెలిసింది. వీటితోపాటు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలపైనా చర్చ జరగనుంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

మురళీధర్‌రెడ్డి, గోపికృష్ణ మృతి పట్ల సిఎం సంతాపం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సీనియర్ పాత్రికేయులు బి మురళీధర్ రెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతాపం తెలిపారు. ది హిందూ పత్రికతో పాటు పలు పత్రికల్లో మురళీధర్ రెడ్డి ఎంతో సమర్థవంతంగా పనిచేశారని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఢిల్లీతోపాటు శ్రీలంక, పాకిస్థాన్‌లో కూడా మురళీధర్ రెడ్డి కరస్పాండెంటుగా పనిచేసి రిపోర్టింగ్‌లో తనదైన ముద్ర వేశారని, అతనితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అతని మృతి విచారకరమని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

గోపికృష్ణ మృతి పట్ల దిగ్భ్రాంతి

అమెరికాలోని టెక్సాస్‌లో జరిగిన కాల్పుల ఘటనలో మృతిచెందిన బాపట్ల వాసి దాసరి గోపికృష్ణ మృతి పట్ల సిఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గోపికృష్ణ మృతదేహాన్ని తన ఇంటికి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని, కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

తేనెటీగల దాడిలో గాయపడిన వృద్ధుడు మృతి

ప్రజాశక్తి- వెదురుకుప్పం (చిత్తూరు జిల్లా)


నరసింహారెడ్డి (ఫైల్)

తేనెటీగల దాడిలో గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ సంఘటన చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలయ్యపల్లి గ్రామానికి చెందిన బండి నరసింహారెడ్డి (93) ఈ నెల 14న గ్రామ సరిహద్దులో కుటుంబ సభ్యులతో కలిసి గ్రామదేవతకు పూజలు చేస్తున్నారు. ఆ సమయంలో తేనెటీగలు ఒక్కసారిగా గుంపుగా వచ్చి నరసింహారెడ్డిపై దాడి చేశారు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను నిమిత్తం తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు.

కర్రీ పాయింట్ వ్యాపారి హత్య

ప్రజాశక్తి - చీరాల

కర్రీ పాయింట్ వ్యాపారి దారుణ హత్యకు గురైన సంఘటన బాపట్ల జిల్లా చీరాలలోని ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీరాలలోని సంగం థియేటర్ సమీపంలో కంచర్ల సంతోష్ (35) కర్రీ పాయింట్ నిర్వహిస్తుండగా, కర్రీ పాయింట్‌కు ఎదురుగా కె.ఉమామహేశ్వరరావు అనే వ్యక్తి పండ్ల వ్యాపారం చేస్తున్నారు. పండ్ల దుకాణం ఎదుట రోడ్డుపై ఉమామహేశ్వరరావు నీటిని పారబోశారు.

ఆ నీళ్లు కర్రీ పాయింట్ వరకు వెళ్లాయి. ఈ విషయమై సంతోష్, ఉమామహేశ్వరరావు మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఉమామహేశ్వరరావు కత్తితో సంతోష్‌ను పొడిచాడు. తీవ్రంగా గాయపడిన సతీష్‌ను స్థానికులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దోసపాడు అసైన్డ్‌భూములు దళితులకే...

- ఏలూరు జిల్లా జెసి కోర్టు తీర్పు
- ఫలించిన ఎనిమిదేళ్ల పోరాటం

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి



సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాదయాత్ర (ఫైల్ ఫొటో)

ఏలూరు జిల్లా దెందులూరు మండలం దోసపాడు గ్రామంలోని అసైన్డ్ భూములను అసలైన అసైన్డ్‌దారులకే పంచాలని ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ (జెసి) కోర్టు గురువారం తీర్పు ఇచ్చింది. దీంతో, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దళితులు చేస్తున్న ఎనిమిదేళ్ల సుదీర్ఘ పోరాటానికి న్యాయం జరిగిందని సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. దోసపాడు గ్రామంలోని వందమందికిపైగా దళితులకు 1975లో అప్పటి ప్రభుత్వం 106.14 ఎకరాల భూములను పంపిణీ చేసింది. కొంతకాలం తర్వాత దళితులను బెదిరించి, వివిధ రకాలుగా ప్రలోభపెట్టి అక్రమంగా ఆ భూములను విజయవాడకు చెందిన దేవినేని బాజీ ప్రసాద్, బీహార్‌కు చెందిన పప్పుసింగ్ తదితరులు సొంతం చేసుకున్నారు. ఆ భూముల్లో చేపల చెరువులు తవ్వేసి దర్జాగా అనుభవిస్తున్నారు. అసైన్డ్ భూములు కొనుగోలు చేయడం, ఆక్రమించుకోవడం నేరమంటూ కొంతమంది లోకాయుక్తను ఆశ్రయించారు. అసైన్డ్ భూములు దళితులకే చెందుతాయని, అసైన్డ్ భూములకు సంబంధించి అమ్మకాలు, కొనుగోళ్లు చెల్లవని లోకాయుక్త తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ కబ్జాదారులు జాయింట్ కలెక్టర్ (జెసి) కోర్టును ఆశ్రయించారు. దీంతో, 2016లో బాధితులు కూడా జెసి కోర్టులో తమ కౌంటర్ పిటిషన్‌ను దాఖలు చేశారు. భూములను సొంతం చేసుకున్న బడాబాబులకు రాజకీయ, ఆర్థిక పలుకుబడి పుష్కలంగా ఉండడంతో రెవెన్యూ అధికారులు వారికి వత్తాసు పలుకుతూ వచ్చారు. తమ భూములను తమకు అప్పగించి న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున దళితులు పోరాటం సాగించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సాగిన ఈ పోరాటంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దోసపాడు నుంచి ఏలూరు కలెక్టరేట్ వరకూ పాదయాత్ర నిర్వహించారు. 22 రోజులపాటు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు, ఆరు రోజులపాటు కలెక్టరేట్ వద్ద వంటావార్పు కార్యక్రమం, తహశీల్దార్ కార్యాలయం వద్ద మూడు రోజులు నిరాహార దీక్షలు చేశారు. భూముల్లోకి ప్రవేశించి చేపలు పట్టడం, చెరువులకు గండికొట్టడం, వరి నాట్లు వేయడం వంటి అనేక పోరాట కార్యక్రమాలు సాగాయి. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ, రాష్ట్ర నేతలు కూడా ఈ పోరాటంలో పాల్గొని దళితులకు అండగా నిలిచారు. పోలీసులను ప్రయోగించి దోసపాడు దళితుల పోరాటాన్ని అణచివేయడానికి అధికార యంత్రాంగం చేయని ప్రయత్నం లేదు. అక్రమ కేసులు బనాయించడం, గ్రామంలో 144 సెక్షన్ అమలు చేసి వేధింపులకు గురిచేయడం వంటి దుర్మార్గపు చర్యలు సాగాయి. అనేకమంది జిల్లా జాయింట్ కలెక్టర్లు మారినప్పటికీ దోసపాడు భూముల సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. ఎట్టకేలకు ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి ఈ నెల 20న తీర్పును వెల్లడించారు. దోసపాడు అసైన్డ్ భూములను అసలైన అసైన్డ్‌దారులకు పంపిణీ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అందుకు సంబంధించిన తీర్పు కాపీ బాధితులకు ఆదివారం అందింది. ఇది పేదల పోరాటానికి దక్కిన న్యాయంగా చెప్పొచ్చు. తీర్పుతో వందమందికిపైగా దళిత కుటుంబాలకు న్యాయం జరగనుంది.

జాయింట్ కలెక్టర్ కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలి : ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

దోసపాడులో వాస్తవ అసైన్డ్‌దారులకు భూములు అప్పగించాలని జాయింట్ కలెక్టర్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తక్షణం అమలు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. కోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ కాపీలను ఏలూరులోని అన్నే భవనంలో వారు విడుదల చేశారు. రెవెన్యూ శాఖ అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి ఈ జడ్జిమెంట్‌ను వెంటనే అమలు చేయాలని, అసలైన అసైన్డ్‌దారులకు పట్టాలు, పాస్‌పుస్తకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. భూమి అప్పగించి దానిపై వారికి సర్వహక్కులూ కల్పించాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాడుతామని హెచ్చరించారు.

రామాపురం బీచ్‌లో విషాదం

- సముద్రంలో మునిగి ఇద్దరు యువకుల మృతి

ప్రజాశక్తి - చీరాల


బాల నాగేశ్వరరావు


పడవల బాలసాయి

బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామాపురం బీచ్‌లో విషాదం చోటు చేసుకుంది. సముద్ర స్నానానికి వెళ్లిన యువకుల్లో ఇద్దరు నీట మునిగి మృతి చెందారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా మంగళగిరి ప్రాంతానికి చెందిన బంగారం దుకాణంలో పనిచేసే 12 మంది యువకులు ఆదివారం సరదాగా గడిపేందుకు రామాపురం బీచ్‌కు వచ్చారు. సముద్రంలో స్నానం చేస్తుండగా అలల ధాటికి పడవల బాలసాయి (25), బాల నాగేశ్వరరావు (26) గల్లంతయ్యారు. కొద్ది సేపటికి ఇద్దరి యువకుల మృతదేహాలు ఒడ్డుకు చేరాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ప్రభుత్వాసుపత్రికి చేరుకుని బాలసాయి, బాల నాగేశ్వరరావు మతదేహాలను సందర్శించారు. మృతుల తల్లిదండ్రులను పరామర్శించారు. ప్రమాదానికి కారణాలను తోటి స్నేహితులను అడిగి తెలుసుకున్నారు.

వైసిపి ఆధీనంలో 42 ఎకరాలు

- మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి కోసం 26 జిల్లాల్లో 42 ఎకరాలకు పైగా భూములను వెయ్యి రూపాయల నామమాత్రపు లీజుకు 33 ఏళ్లకు కేటాయించుకున్నారని మాజీ సిఎం జగన్‌ను ఉద్దేశించి మంత్రి నారా లోకేష్ విమర్శించారు. రాష్ట్రం నీ తాత రాజారెడ్డి జాగీరా? అని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనం నుంచి దోచుకున్న రూ.500 కోట్లతో ప్యాలెస్‌లు కడుతున్నావని ఆరోపించారు. ఒక్కడి భూ దాహానికి కబ్జా అయిన రూ.600 కోట్లకు పైగా విలువైన 42 ఎకరాల్లో 4,200 మంది పేదలకు సెంటు స్థలాలు ఇవ్వొచ్చని పేర్కొన్నారు. విలాసాల ప్యాలెస్‌ల నిర్మాణానికి అయ్యే రూ.500 కోట్లతో 25 వేల మంది పేదలకు ఇళ్లు కట్టి ఇవ్వొచ్చుని తెలిపారు.

నేడు బాధ్యతల స్వీకరణ

విద్య, ఐటిశాఖల మంత్రిగా నారా లోకేష్ సోమవారం బాధ్యతలు తీసుకోనున్నారు. సచివాలయంలోని నాలుగో అంతస్తులో ఉదయం 9:45 గంటలకు స్వీకరించనున్నారు. ఛాంబర్లలో స్థలాభావం వల్ల మీడియా ప్రతినిధులకు అనుమతి లేదని లోకేష్ కార్యాలయం సిబ్బంది చైతన్య ఒక ప్రకటనలో వెల్లడించారు.

27న రామోజీరావు సంస్మరణ సభ

- మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు సంస్మరణ కార్యక్రమం ఈ నెల 27న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. పెనమలూరు మండలం, తాడిగడప-ఎనికేపాడు 100 అడుగుల రోడ్డు చైతన్య మహిళా జూనియర్ కళాశాల ఎదుట నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ఏర్పాట్ల గురించి ఐ అండ్ పిఆర్ మంత్రి కొలుసు పార్థసారథి వివిధ శాఖల అధికారులతో ఆదివారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రామోజీరావు జీవిత విశేషాలు, పత్రికా రంగానికి చేసిన సేవలపై ప్రత్యేక ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడంతోపాటు షార్ట్‌ఫిలిం ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అవసరమైన లైటింగ్, నిరంతర విద్యుత్తు సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. వివిఐపి, పబ్లిక్ గ్యాలరీలు ఏర్పాటుచేయడంతో పాటు ప్రతి గ్యాలరీకి ఇన్‌ఛార్జులను నియమించాలని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమానికి సిఎం చంద్రబాబు హాజరు కానున్న నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేయాలన్నారు. పార్కింగ్ ప్రదేశాలను మంత్రితోపాటు పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పరిశీలించారు. వీరితోపాటు సిఆర్‌డిఎ అదనపు కమిషనరు అలీం బాషా, సమాచారశాఖ అదనపు డైరెక్టరు ఎల్ స్వర్ణలత, జాయింట్ డైరెక్టర్లు కిరణ్‌కుమార్, కస్తూరి, సిఇ మధుసూదన్, ప్రొటోకాల్ అదనపు డైరెక్టరు వాణి పాల్గొన్నారు.

బండి సంజయ్‌కు కేంద్రమంత్రిగా కొనసాగే హక్కు లేదు

- కరీంనగర్‌లో కార్యాలయం ముట్టడికి విద్యార్థి, యువజన సంఘాల యత్నం
- అడ్డుకున్న పోలీసులు.. అరెస్ట్, పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాలను అడ్డుకుంటున్న పోలీసులు

నీట్ పరీక్ష రాసిన 24 లక్షల మంది విద్యార్థుల భవితవ్యంపై నోరు మెదపని బండి సంజయ్‌కి కేంద్రమంత్రిగా కొనసాగే నైతిక హక్కు లేదని విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ యుజిసి పరీక్షా అంశంపై స్పందించాలని విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కోర్టు నుంచి కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ క్యాంపు ఆఫీస్ వరకూ ర్యాలీగా ఆఫీస్ ముట్టడికి తరలివెళ్లారు. మధ్యలోనే పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర తోపులాట జరిగింది. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగరపు రజినీకాంత్‌తో పాటు ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యుఐ, పిడిఎస్‌యు, డివైఎఫ్ఐ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బండి సంజయ్‌కు మత రాజకీయాలపై ఉన్న శ్రద్ధ లక్షలాదిమంది విద్యార్థుల భవితవ్యంపై లేకపోవడం సిగ్గుచేటన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే పేపర్ లీకేజీలు, అవకతవకలు జరిగాయని, విద్యార్థుల జీవితాలు చిన్నాభిన్నం అవడంతో దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రోడ్డెక్కి ఉద్యమం చేస్తుంటే ప్రధాని మోడీ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. నరేంద్ర మోడీ నీట్ పేపర్ లీకేజీ అంశంపై చాయ్ పే చర్చా కార్యక్రమాన్ని నిర్వహించేలా బండి సంజయ్ అడగాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీలు చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న బిజెపి ప్రభుత్వానికి దేశాన్ని పరిపాలించే హక్కు లేదని అన్నారు. నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ఉక్కు పరిరక్షణ దీక్షల్లో కూర్చున్న నాయకులు

స్టీల్‌ప్లాంట్‌ను కారుచౌకగా కొట్టేసేందుకు కుట్ర

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

మూడున్నర లక్షల కోట్ల రూపాయలు ఆస్తులు కలిగిన విశాఖ ఉక్కును కారుచౌకగా కొట్టేసేందుకు కార్పొరేట్ సంస్థలు ప్రయత్నాలు చేస్తున్నాయని, ఆ క్రమంలోని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్లాంట్‌ను వెంటిలేటర్‌పై పెట్టిందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1228వకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు, బి.మల్లయ్య, తౌడన్న మాట్లాడుతూ.. సొంత గనులు లేకున్నా లాభాల్లో నడిచిన ఘన చరిత్రను స్టీల్‌ప్లాంట్ కలిగి ఉందన్నారు. అటువంటి కర్మాగారంపై అనేక ఆంక్షలు విధించి మోడీ సర్కారు నష్టాలవైపు నెట్టేస్తోందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలను గుర్తెరిగి ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ప్లాంట్ విస్తరణ దిశగా చర్యలు తీసుకుంటే ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే విశాఖ ఉక్కును ఆధీనంలోకి తీసుకొని నడిపించాలని కోరారు. అలాకానిపక్షంలో ప్రత్యామ్నాయ మార్గంగా సెయిల్‌లో విలీనం చేసేందుకు కేంద్రంపై ఒత్తిడి పెంచాలని తెలిపారు. దీక్షల్లో శ్రీనివాస్ నాయుడు, పుల్లారావు, వి.రామ్మోహన్ కుమార్, సత్యనారాయణ, ఎల్‌వి.రమణ, కామేశ్వరరావు, పి.పెంటారావు, డి.జనార్ధన్, నాయక్ పాల్గొన్నారు.

కౌలు రైతు గుర్తింపు ఎలా?

(మొదటి పేజీ తరువాయి)

పంటల బీమా, ఇతర ప్రభుత్వ పథకాలు, చివరికి పండించిన పంట కూడా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోలేని దుస్థితి కౌలు రైతులది.

ఇప్పటి యాక్ట్‌తో దగానే..

టిడిపి కూటమి సర్కారు తన మేనిఫెస్టోలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులిస్తామని, పథకాలు అమలు చేస్తామని పేర్కొంది. దాంతో గుర్తింపు ఎలా అనే దానిపై కౌల్దార్లలో ఉత్కంఠ నెలకొంది. సిసిఆర్‌సి యాక్ట్‌తో గుర్తింపు కష్టం. అదే జరిగితే రైతులకు ఏటా ఇస్తామన్న రూ.20 వేల ఆర్థిక సాయం సైతం వైసిపి 'భరోసా' మాదిరే అవుతుంది. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ వలే సిసిఆర్‌సి యాక్ట్‌ను రద్దు చేయడం, లేదంటే కొన్ని నిబంధనలను సమూలంగా మార్చాల్సిన అవస రం ఉందని కౌల్దార్లలో చర్చ జరుగుతుంది. అప్పుడే కూటమి మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు కౌలు రైతుల సంక్షేమం సాకారమవుతుందన్నది కౌలు రైతుల మాట.

నేటి నుంచి పార్లమెంటు సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రొటెం స్పీకరు మహతాబ్‌కు సహకరించేందుకు సీనియర్ లోక్‌సభ సభ్యులను కొడికున్నిల్ సురేష్, టి.ఆర్. బాలు, రాధా మోహన్ సింగ్, ఫగ్గన్ సింగ్ కులస్తే, సుదీప్ బంద్యోపాధ్యాయను రాష్ట్రపతి నియమించారు.

లోక్‌సభ స్పీకరు పదవికి బుధవారం ఎన్నిక జరగనుంది. ఆ తర్వాత ప్రధాని తన మంత్రి మండలిని సభకు పరిచయం చేస్తారు. జూన్ 27న పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించనున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జూన్ 28న చర్చ ప్రారంభమవుతుంది. జులై 2, 3న చర్చకు ప్రధాని సమాధానం ఇస్తారు. కొన్నిరోజుల విరామం తర్వాత జులై 22న కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడం కోసం మళ్లీ సమావేశాలు జరుగుతాయి.

ప్రొటెం స్పీకర్ నియమాకంపై వివాదం

ప్రొటెం స్పీకరుగా బిజెపి నేత, ఏడుసార్లు లోక్‌సభకు ఎన్నికైన భర్తృహరి మహతాబ్ నియామకంపై వివాదంతో లోక్‌సభలో నీలినీడలు కమ్మే అవకాశం ఉంది. ఆయన నియామకం పార్లమెంటు నిబంధనలకు విరుద్ధంగా ఉందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. సభలోని సీనియర్ సభ్యుడిని ప్రొటెం స్పీకరుగా నియమించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖ హ్యాండ్ బుక్ చెబుతోందని తెలిపాయి. కేరళకు చెందిన కాంగ్రెస్ ఎంపి కె సురేష్ 1989 నుంచి 2024 వరకు ఎనిమిది సార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారని తెలిపాయి. వాస్తవానికి ప్రొటెం స్పీకరుగా కె సురేష్‌ను నియమించాలని, కానీ దళితుడనే కారణంగానే ఆయనను నియమించలేదని ప్రతిపక్షాలు విమర్శించాయి. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూడా కె సురేష్‌ను నియమించకపోవడంపై కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వెనుక సంఘ్ పరివార్ అగ్రవర్ణ రాజకీయాలు పనిచేశాయని అనుమానించే వారికి బిజెపి సమాధానం ఇవ్వగలదా? అని ప్రశ్నించారు.

అయితే, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరెన్ రిజిజు స్పందిస్తూ, వరుసగా పదవీకాల పరంగా ఎక్కువ కాలం ఎంపిగా పనిచేసిన మహతాబ్‌ను ఎంపిక చేసినట్లు చెప్పారు.

భవనాల కూల్చివేత సరికాదు

(మొదటి పేజీ తరువాయి)

బిజెపికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నీట్ స్కాంపై విచారణకు, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ రద్దుకు కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని కోరారు. శాసనసభలో ఒక బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా వైసిపి వ్యవహరించాలని, శాసనసభను బహిష్కరించడం సముచితం కాదని అన్నారు. రాష్ట్రంలో పార్టీ పటిష్టతకు తీసుకుంటున్న చర్యలను శ్రీనివాసరావు వివరించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలను అభినందించారు.

ఎ(ఉ)త్తిపోతల పథకాలు

- నిర్వహణను గాలికొదిలేసిన ప్రభుత్వాలు
- ఆదుకోని పుష్కర, పురుషోత్తపట్నం లిఫ్ట్‌లు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గోదావరి నీటిని ఎత్తిపోసి మెట్ట ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలని నిర్మించిన ఎత్తిపోతల పథకాలు నిర్వహణ లేక ఉత్సవ విగ్రహాలుగా దర్శనమిస్తున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలోని మేజర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులైన పుష్కర, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాలు సాగునీటి లక్ష్యాలను చేరుకోలేకపోతున్నాయి. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో 2009లో పుష్కర ఎత్తిపోతల పథకాన్ని రూ.608 కోట్లతో ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎనిమిది మండలాలు, విశాఖ జిల్లాలో ఒక మండలానికి సాగు, తాగునీటిని సరఫరా చేయాలని నిర్ణయించారు. 1.85 లక్షల ఎకరాలను సాగు నీరు అందించాలనేది లక్ష్యం. ప్రస్తుతం లిఫ్ట్‌లో నాలుగు మోటార్లకు రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. గతేడాది ఇదే సమయంలో నాలుగు మోటార్లూ మొరాయించడంతో రైతులు ఆందోళన చేశారు. దీంతో, రెండు మోటార్లను బాగుచేయించారు. ఇందులో ఒకటి మాత్రం తీసుకొచ్చి నీటిని విడుదల చేశారు. మరో మోటారును మరమ్మతులకు ఇచ్చి ఏడాదైనా నేటికీ తీసుకురాలేదు. పోలవరం ఎడమ కాలువపై 2017లో పురుషోత్తపట్నం వద్ద ఎనిమిది మోటార్లతో రూ.1,938 కోట్లను వెచ్చించి ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. పోలవరం ప్రాజెక్టు పనులు ఆలస్యం కావడంతో మెట్ట, విశాఖలో తాగునీరు, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నీటిని అందించేందుకు అప్పటి టిడిపి సర్కారు ఈ పథకాన్ని హడావుడిగా ప్రారంభించింది. పురుషోత్తపట్నం నుంచి జగ్గంపేట మండలం రామవరం వరకూ పైపులైను నిర్మించారు. రామవరంలో రూ.500 కోట్లతో పంప్ హౌస్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ నుంచి ఏలేరులోకి నీటిని పంప్ చేసి విశాఖకు అందించాలని నిర్ణయించారు. తొలివిడతగా రెండు మోటార్లతో పథకాన్ని ప్రారంభించారు. ప్రారంభం రోజునే గోకవరం సమీపంలో పైపులైన్లకు లీకులు ఏర్పడ్డాయి. అనంతరం లీకులను సరిచేసి పథాకాన్ని ప్రారంభించారు.

క్రమంగా ఆరు మోటార్లను వినియోగంలోకి తీసుకొచ్చారు. 2019లో వైసిపి ప్రభుత్వం రావడంలో ఈ పథకాన్ని పూర్తిగా గాలికొదిలేసింది. ఎనిమిది మోటార్లకుగానూ ప్రస్తుతం ఆరు మాత్రమే పని చేస్తున్నాయి. పైపులైన్లకు 32 చోట్లకుపైగా లీకేజీలు పడ్డాయి. వీటికి తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేశారు. రామవరంలో పంప్‌హౌస్ వద్ద నిర్వహణకు కనీసం సిబ్బంది కూడా లేదు.

విడుదల కాని నిధులు

పుష్కర, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాల నిర్వహణ కోసం బడ్జెట్లో ఏటా రూ.2.5 కోట్ల వరకూ నిధులు విడుదల చేసేవారు. గడిచిన ఐదేళ్లుగా ఈ నిధులు విడుదలకు నోచుకోలేదు. ఈ ఏడాది పుష్కర ఎత్తిపోతల పథకం మరమ్మతులు, మోటార్ల బిగింపు, లీకేజీలను అరికట్టేందుకు రూ.4.36 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావట్లేదు. ఈ పథకాల నిర్వహణకు సంబంధించి రూ.18 కోట్లకు పైబడి బకాయిలు ఉండటంతో కాంట్రాక్టర్లు ముఖం చాటేశారు.

కానరాని పూడిక తీత

ఎత్తిపోతల పథకాల ద్వారా నీటి సరఫరా చేయాలంటే గోదావరి నదిలో పురుషోత్తపట్నం వద్ద 14 మీటర్ల వరకు నీటిమట్టం ఉండాలి. ప్రస్తుతం ఇక్కడ ఎనిమిది మీటర్ల మేర మాత్రమే నీటిమట్టం ఉంది. పంపుహౌస్ వెల్ వద్దకు నీటి ప్రవాహం చేరేలా పూడికతీత పనులు నిలిపేయడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ప్రతి ఏడాది జూన్ నెలాఖరు నాటికి ఒకటి లేదా రెండు పంపుల ద్వారా మెట్టకు సాగు నీటిని అందించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.


పుష్కర ఎత్తిపోతల పథకంలో ఏర్పాటు చేసిన మోటార్లు

పూర్తి స్థాయిలో నీటిని అందించాలి

పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చే నీటితోనే ఖరీఫ్‌లో సాగు చేస్తున్నాం. ప్రస్తుతం తొలకరి వర్షాలు మొదలవ్వడంలో సాగు పనులు చేపట్టాం. వర్షాలు కురిసినంత కాలం సాగుకు డోకా లేదు. పంట పొట్టదశలో ఉన్న క్రమంలో ఏటా సాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మోటార్లు సరిగా పనిచేయక పోవడంతో నీటిని విడుదల చేయట్లేదు. ఈ ఏడాదైనా పూర్తి స్థాయిలో పంటలకు నీరందేలా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి.

- యడ్ల సత్యనారాయణమూర్తి, రైతు, రాజానగరం

పూర్తి స్థాయిలో నీటిని అందించేలా చర్యలు

పుష్కర, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాల ద్వారా పూర్తి స్థాయిలో నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటాం. ఎత్తిపోతల పథకాల నిర్వహణ కాంట్రాక్టర్‌కు నాలుగేళ్లకు సంబంధించిన బిల్లులు చెల్లించాల్సి ఉంది. గోదావరికి పూర్తి స్థాయిలో వరద నీరు వస్తేనే ఈ పథకాలను వినియోగించుకునే వెసులుబాటు ఉంటుంది. ప్రస్తుతానికి మోటార్లు పనిచేస్తున్నాయి. రానున్న కాలంలో సాంకేతిక సమస్యలు వచ్చినా సరిచేసి రైతులకు పూర్తి స్థాయిలో నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

- ఆర్. వెంకట్రావు, డిఇ, ఇరిగేషన్ శాఖ

పిఇటి, ఎస్‌జిటి పోస్టులు పెంచాలి

- డివైఎఫ్ఐ విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనున్న మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌లో పిఇటి, ఎస్‌జిటి పోస్టులను పెంచాలని డివైఎఫ్ఐ విజ్ఞప్తి చేసింది. విజయవాడలోని డివైఎఫ్ఐ కార్యాలయంలో పిఇటి అభ్యర్థులతో ఆదివారం సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న, వ్యాయామ ఉపాధ్యాయ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి దేవేంద్ర గౌడ్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డిఎస్‌సిలో పిఇటి పోస్టులు 132, ఎస్‌జిటి పోస్టులు 6,347 మాత్రమే చూపించారని తెలిపారు. నిరుద్యోగ వ్యాయామ ఉపాధ్యాయులకు యుపి పాఠశాలల్లో పిఇటి పోస్టు తప్పనిసరిగా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్‌జిటి సంఖ్య పెంచి పేదల ప్రాథమిక విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం పిఇటి పోస్టులను 100 శాతం అప్‌గ్రేడ్ చేయడం వల్ల పిఇటి పోస్టులు లేకుండా చేశారని తెలిపారు. రాష్ట్రంలో 90 వేల మందికి పైగా డిపిఇడి పూర్తిచేసి శిక్షణ తీసుకుంటున్నారన్నారు. ఇప్పుడు పోస్టులు లేకపోవడం వల్ల అన్యాయానికి గురవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో వ్యాయామ విద్య అభివృద్ధి చెందాలంటే ఒకటి నుంచి 8వ తరగతులకు వ్యాయామ ఉపాధ్యాయుడు (పిఇటి) ఉండాలన్నారు. ఈ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయుడు లేకపోవడం వల్ల విద్యార్థులు వ్యాయామ విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో క్రీడలు అభివృద్ధి జరగాలన్నా, విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నా పాఠశాలల్లో వ్యాయామ విద్య చాలా అవసరం అన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన జిఓ 117ను రద్దు చేయాలని కోరారు. అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలని, గత ప్రభుత్వం చేతకాక మూసివేసిన పాఠశాలలను తిరిగి పునరుద్ధ రించాలని కోరారు. నోటిఫికేషన్ వయోపరిమితి సడలింపు 47కు పెంచాలని, ఉపాధ్యాయ రిటైర్డు వయసు 58కి తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అమీర్, అశోక్, కార్తీక్, యుగంధర్, మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగు దాడిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం (చిత్తూరు జిల్లా)

ఏనుగు దాడిలో గుర్తు తెలియని వ్యక్తి మరణించిన సంఘటన చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మొగిలి ఘాట్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. సిఐ లక్ష్మయ్య తెలిపిన సమాచారం మేరకు.. గుర్తు తెలియని వ్యక్తి శనివారం రాత్రి మొగిలి ఘాట్ వద్ద నడుచుకుంటూ వస్తుండగా ఏనుగు దాడి చేసి చంపినట్లు ఆనవాళ్లు ఉన్నాయని తెలిపారు.

మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మరణించిన వ్యక్తిని గుర్తించిన వారు బంగారుపాళ్యం పోలీసు స్టేషన్‌లోగానీ, 9440796736 నంబరును సంప్రదించాలని సిఐ కోరారు.

డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌తో నేడు టాలీవుడ్ నిర్మాతల భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌తో ఈనెల 24న టాలీవుడ్ నిర్మాతలు విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో భేటీ కానున్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వాన్ని అభినంధించి గత ప్రభుత్వంలో ఎదుర్కొన్న సమస్యలను వివరించనున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నిర్మాతలు పవన్‌కల్యాణ్‌ను కోరనున్నారు.

నేడు డిప్యూటీ సిఎంతో జరుగనున్న బేటీలో నిర్మాతలు అశ్వినీదత్, హారిక హాసిని చినబాబు, మైత్రి మూవీ మేకర్స్ నవీన్, రవి శంకర్, సితార ఎంటర్‌టైన్‌మెంట్ నాగవంశీ, పీపుల్స్ మీడియా విశ్వప్రసాద్, వివేక్, తెలుగు ఫిలిం చాంబర్ అధ్యక్షులు దిల్‌రాజు, దామోదర్ ప్రసాద్, బోగపల్లి ప్రసాద్, డివివి దానయ్య ఉంటారని తెలిసింది.

'రైతు భరోసా' పెంపు హామీ అమలు చేయండి

- అచ్చెన్నకు ఎపి రైతు సంఘం లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల మేనిఫెస్టోలో రైతు భరోసా పథకాన్ని రూ.20 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. అధిక వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకివ్వాల్సిన నష్టపరిహారాలు, సున్నా వడ్డీ, పావలా వడ్డీ వెంటనే ఇవ్వాలని కమిటీ పేర్కొంది. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు ఎపి రైతు సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, వై కేశవరావు, కె ప్రభాకరరెడ్డి, మర్రాపు సూర్యనారాయణ లేఖ రాశారు. రైతు భరోసా కేంద్రాలు రైతుకు ఉపయుక్తంగా ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశంతో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్తు మోటార్లు ఏర్పాటు చేసేందుకు జిఓ నెంబరు 22 ఇచ్చిందని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి అడ్డగిస్తున్నప్పటికీ శ్రీకాకుళం జిల్లాలో రైతులను బెదిరించి ఏర్పాటు చేశారని, వెంటనే ఆ జిఓను చేయాలని మంత్రికి రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు రైతు పెట్టుబడి కూడా వచ్చేలా లేదని, డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సూచించిన సి2 ప్లస్ 50 ఫార్ములా ప్రకారం మద్దతు ధరలు చట్టం కోసం ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి పోరాడుతోందన్నారు. పొరుగున కేరళ ప్రభుత్వం 14 పంటలకు సి 2 ప్లస్50 అమలు పరుస్తుందన్నారు. తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాలు కేంద్రం ధరపై అదనంగా బోనస్ ఇస్తున్నాయన్నారు. మన రాష్ట్రంలో ఉత్పత్తి ఖర్చులు ఎక్కువ, అందువల్ల కేంద్రం ప్రకటించిన ధరలపై క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని, సుమారు రూ.1,600 కోట్లు ధాన్యం బకాయిలను వెంటనే ఇవ్వాలని కోరారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దుకు అసెంబ్లీలో చట్టం చేయాలని, భూసర్వేలో న్యూ డిజిటలైజ్ చేసి పట్టాదారు పుస్తకాలు ఇవ్వడంలోనూ అనేక లోపాలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలోని రైతులందరికీ లోపాలు లేని కచ్ఛితమైన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని మంత్రి అచ్చెన్నకు విజ్ఞప్తి చేశారు.

పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయాలని, ఈలోపు నిర్వాసితుల పునరావాసం, నష్టపరిహారం కార్యక్రమం పూర్తి చేయాలని, రాయలసీమ, ఉత్తరాంధ్ర, వెనుకబడిన ప్రాంతాల ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని లేఖలో కోరారు. రాష్ట్రంలో 32 లక్షల మంది కౌలురైతులు ఉన్నారని, గత ప్రభుత్వం కౌలు రైతుకు కార్డు ఇవ్వడానికి యజమాని సంతకం తప్పనిసరి అని జిఓ ఇచ్చిందని, ఫలితంగా అత్యధిక రైతులు కార్డులు పొందలేకపోయారని అన్నారు. బ్యాంకు రుణాలు, పంటల బీమా, నష్టపరిహారాలు ప్రభుత్వ సబ్సిడీలు, రైతు భరోసా పొందలేకపోతున్నారని లేఖలో ప్రస్తావించారు. ప్రభుత్వం కౌలు రైతులకు ఇబ్బంది లేకుండా ఆటంకంగా ఉన్న భూయజమాని సంతకమనే నిబంధనను తొలగించి కార్డులు జారీ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

బాలినేని అక్రమాలపై విచారణ

- జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణరెడ్డి డిమాండ్

ప్రజాశక్తి- ఒంగోలు సబర్బన్

గత ఐదేళ్ల కాలంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన అవినీతి, అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని రంగా భవన్‌లో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. బాలినేని శ్రీనివాసరెడ్డి అనుచరులు దొంగ రిజిస్ట్రేషన్‌లతో భూ కబ్జాలు చేస్తూ ఒంగోలు నగరంలో భయానక వాతావరణాన్ని సృష్టించారన్నారు. వాటి పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. పోతురాజు కాలువ ఆధునీకరణ కోసం రూ.90 కోట్లు కేటాయించినా టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపివేసినట్లు తెలిపారు. నిర్మించిన సైడ్‌వాల్స్ వర్షాలకు కూలిపోయాయని గుర్తు చేశారు. పోతురాజు కాలువ అవకతవకలపై లోకాయుక్తాలో కేసు నమోదై విచారణ జరుగుతోందన్నారు. బాలినేని నిర్మిస్తున్న విల్లాలకు అక్రమంగా కోట్లాది రూపాయల గ్రావెల్ తరలించారని, విల్లాల నిర్మాణంలో వాగు పోరంబోకు భూమిని కలుపుకున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలపై విచారణ జరపాలని కోరారు. ఈ సమావేశంలో ఒంగోలు సిటిజన్స్ అసోషియేషన్ అధ్యక్షులు కొల్లా మధు, విశ్రాంత అడిషనల్ ఎస్‌పి సుంకర సాయిబాబు, ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మారెళ్ల సుబ్బారావు, సుపరిపాలన వేదిక ఉపాధ్యక్షులు కంచర్ల సుబ్బారావు, ప్రముఖ న్యాయవాది ఎన్.దేవకుమారి పాల్గొన్నారు

రోడ్డు ప్రమాద రహిత రాష్ట్రమే ధ్యేయం

- త్వరలో మహిళలకు ఉచిత ప్రయాణం
- ఆర్‌టిసి ఆస్తుల ధారాదత్తంపై విచారణకు కమిటీ
- రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రోడ్డు ప్రమాదాల రహిత రాష్ట్రంగా ఎపిని తీర్చిదిద్దుతామని రవాణా, క్రీడలు, యువజన సర్వీసులశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. అందుకు తగ్గట్టుగా రాష్ట్రంలో రహదారుల స్థితిగతులను మెరుగుపరచడంతోపాటు ఆర్‌టిసి డ్రైవర్లకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలను పెద్దయెత్తున నిర్వహిస్తామన్నారు. సచివాలయంలోని నాలుగో బ్లాక్‌లో ఆదివారం ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా దర్శిలో రూ.18.51 కోట్ల అంచనా వ్యయంతో డ్రైవింగ్, శిక్షణ, రీసెర్చ్ సంస్థను ఏర్పాటుచేసే ఫైలుపై తొలి సంతకం చేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. రూ.కోట్లు విలువ గల



ఆర్‌టిసి ఆస్తులను బిఒటి పద్ధతిలో కారుచౌకగా ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేశారని, వీటిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా ఒక కమిటీని వేస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే నష్టాన్ని తాను 11 ఏళ్ల వయసులోనే స్వయంగా అనుభవించానని అన్నారు. రోడ్డు ప్రమాదంలో తన తండ్రిని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని మహిళలందరికీ ఎపిఎస్‌ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని త్వరలో కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే యువతలో క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణాశాఖ అదనపు కార్యదర్శి నరసింహారెడ్డి, ఎపిఎస్‌ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కెఎస్ బ్రహ్మానందరెడ్డి, జివి రవివర్మ, చంద్రశేఖర్, ఎపిఎస్‌ఆర్‌టిసి ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వై శ్రీనివాస్, క్రీడాశాఖ ట్రైబల్ స్పోర్ట్స్ ఆఫీసరు ఎస్ వెంకట రమణ, ఎన్‌సిసి అసిస్టెంటు డైరెక్టరు కెజియా పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేశాం.. మళ్లీ మన ప్రభుత్వం వస్తుంది

- వైసిపి కౌన్సిలర్లతో మాజీ సిఎం వైఎస్ జగన్
- ప్రజా దర్బార్‌లో బిజీ బిజీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

'ప్రజలకు మేలు చేశాం.. మన ప్రభుత్వం మళ్లీ వస్తుంది.. అధైర్య పడకండి.. ఆరు నెలలు ఆగండి.. పోరాటం చేద్దాం' అంటూ వైసిపి నాయకులు, మున్సిపల్ కౌన్సిర్లతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్‌ఆర్ జిల్లాలో మూడ్రోజుల పర్యటనలో భాగంగా రెండో రోజు ఆదివారం పట్టణ పరిధిలోని తన కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వైసిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ఆరు నెలల వరకు ఆగండి ప్రభుత్వం ఏం చేస్తుందో వేచి చూద్దాం తర్వాత ప్రజా సమస్యలపై పోరాటాలు చేద్దామని చెప్పారు. తాను ఎప్పటికీ అందుబాటులో ఉంటానని అధైర్య పడకుండా ముందుకెళ్దామని వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు తమపై జరుగుతున్న దాడుల గురించి వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. పట్టణంలో పలు పనులు ఇంకా పెండింగ్ ఉన్నాయని, చేసిన వాటికి కొంతవరకు బిల్లులు రావాల్సి ఉందని విన్నవించారు. దీనికి ఆయన స్పందిస్తూ గత ప్రభుత్వంలో నీరు చెట్టు కింద చేసిన



కౌన్సిలర్లు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జగన్



వై.ఎస్.భారతితో మాట్లాడుతున్న మహిళా కౌన్సిలర్లు

పనులకు సంబంధించి పెండింగ్ ఉన్న బిల్లులను న్యాయస్థానానికి వెళ్లి తెప్పించుకున్నామని, అదే బాటలోనే మనం పోరాడుదామని ముఖ్య కార్యకర్తలకు హామీ ఇచ్చారు.

ఓటమికి కారణాలను, వైసిపి నాయకులు, కార్యకర్తలు పడుతున్న ఇబ్బందుల గురించి ఆరా తీశారు. నియోజకవర్గాలలో అందుబాటులో ఉండి నాయకులలోను, కార్యకర్తలలోను ఉత్సాహాన్ని, ధైర్యాన్ని నింపాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, జిల్లాలోని వైసిపి నాయకులు, నియోజకవర్గంలోని వివిధ మండలాల జడ్‌పిటిసి సభ్యులు, మండల అధ్యక్షులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

సార్ మాకు ఏమీ చేయలేదు : కౌన్సిలర్లు

అధికారంలో ఉన్న ఐదేళ్లూ తమకు ఏమీ మేలు జరగలేని మున్సిపల్ కౌన్సిలర్లు మొరపెట్టుకున్నారు. 33 మందిలో ఆరుగురికి మాత్రమే మేలు జరిగిందని వాపోయారు. ఇందుకు జగన్ స్పందిస్తూ పులివెందుల అభివృద్ధి కోసం కోట్ల రూపాయలు మంజూరు చేశామని తెలిపారు. ఆ నిధులన్నీ ఏమయ్యాయని ముఖ్య నేతలపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తుంది.

ప్రజాదర్బార్‌లో పోటెత్తిన జనం..

జగన్‌ను కలిసేందుకు జిల్లాలోని నలుమూలల నుంచి జనం పోటేత్తారు. పులివెందుల పర్యటనలో భాగంగా ప్రజాదర్బార్ నిర్వహించారు. ఆప్యాయంగా ప్రజలను పలకరిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. జగన్ కలిసేందుకు వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచారు. ప్రజలు ఇచ్చిన వినతులను స్వీకరించారు. సమస్యలపై పోరాటం చేద్దామని ఎవరు నిరుత్సాహపడకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలని జగన్ సూచించారు.

జగన్ సమావేశం అనంతరం వైఎస్ భారతిని మహిళా కౌన్సిలర్లు కలిసి తమ బాధను వ్యక్తం చేశారు. పట్టణంలో జరిగిన అభివృద్ధిలో కేవలం కొంతమందికి మాత్రమే లబ్ధి చేకూరిందని, కౌన్సిలర్లగా ఉండి పిల్లల్ని చదివించుకోలేని పరిస్థితిగా నెలకొందని వాపోయారు.

వైఎస్‌ఆర్ జిల్లా పేరులో కడపను చేర్చాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతల డిమాండ్

ప్రజాశక్తి -కడప అర్బన్

వైఎస్‌ఆర్ జిల్లా పేరులో కడపను చేర్చాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. వైఎస్‌ఆర్ జిల్లా ఎన్‌టియు కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అధ్యక్షతన ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా కడప ఏర్పడి 200 సంవత్సరాలైందని, 20 సంవత్సరాల కిందట కీర్తిశేషులు ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి దిశతాబ్ది ఉత్సవాల పేరుతో కడప చరిత్ర సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేశారని పేర్కొన్నారు. ఆయన మరణానంతరం 2010 ఆగస్టు 7న కడప జిల్లా పేరును వైఎస్‌ఆర్ కడప జిల్లాగా మార్చడం పట్ల పార్టీ, ప్రజా సంఘాలు వ్యతిరేకించి నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. 2019లో జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక నూతన జిల్లాల ఏర్పాటులో వైఎస్‌ఆర్ జిల్లా పేరులో కడప తీసేయడంతో జిల్లా ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. కడప పేరును తొలగించి చరిత్ర ఆనవాళ్లే లేకుండా చేయడం చారిత్రక తప్పిదమని తెలిపారు. జిల్లా పేరులో తిరిగి కడపను చేర్చి ఆ తప్పిదాన్ని సరిదిద్దాలని డిమాండ్ చేశారు. ఇక్కడి ప్రజల విశ్వాసాలు, మెకంజీ కైఫీయత్తుల ప్రకారం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్

కడప అంటే వెంకటేశ్వరుని గడప, కచ్చితమైన చారిత్రక ఆధారం ప్రకారం క్రీ. శ. 971 నాటికే 'కడప' ప్రాదేశిక విభాగంగా ఉనికిలో ఉన్నట్లు వైదుంబ రాజువంశానికి చెందిన భువన త్రినేత్ర అనే రాజు అత్తిరాలలో వేయించిన రాగిశాసనం ద్వారా తెలుస్తోందని తెలిపారు. కొత్తగా ఏర్పడే ప్రాంతాలకైతే ప్రజల మనోభావాల్లో గూడుకట్టుకున్న మనుసుల పేర్లు పెట్టవచ్చునేమోగాని ఉన్న పేరుమార్చి మనిషి పేరు పెట్టడం ఎంత సముచితం అని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వైఎస్‌ఆర్‌జిల్లా పేరులో కడపను చేర్చాలంటూ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని తెలిపారు. దీని కోసం కలెక్టర్‌ను, ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రాలు సమర్పించి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని నిర్ణయించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ ఎన్ తులసిరెడ్డి, టిడిపి రాష్ట్ర నాయకులు బి హరి ప్రసాద్, చేతి వృత్తిదారుల జాతీయ సమాఖ్య అవ్వారు మల్లికార్జున, ఆప్ డాక్టర్ శ్రీనివాసులు, విరసం నాయకులు వరలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్తార్, రైతు స్వరాజ్య వేదిక శివారెడ్డి, అభ్యుదయ వేదిక శంకరయ్య, జన విజ్ఞాన వేదిక విశ్వనాథ్ హాజరయ్యారు.



నాటు వైద్యానికి ఉపయోగించిన సామగ్రి

ప్రాణం తీసిన నాటువైద్యం

- పెదబయలులో ఇద్దరు మృతి
- ఆలస్యంగా వెలుగులోకి..

ప్రజాశక్తి - పెదబయలు (అల్లూరి జిల్లా)

నాటు వైద్యం ఇద్దరి ప్రాణాలను తీసింది. అల్లూరి జిల్లా పెదబయలు మండలంలో బుధవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగుచూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అరడకోట పంచాయతీలోని చుట్టుమెట్ట గ్రామానికి చెందిన నాటు వైద్యుడు కిముడు సహదేవ్ (40), ఆయన సోదరి పాంగి అనాసమ్మ బుధవారం మామిడి కాయలు కోసేందుకు కొండపైన ఉన్న తోటలోకి వెళ్లారు. ఆ సమయంలో పెద్ద శబ్దం రావడంతో అనాసమ్మ భయపడ్డారు. ఆ విషయాన్ని సోదరుడు సహదేవ్‌కు చెప్పగా ఆయన దెయ్యం పట్టి ఉండొచ్చని భావించి వనమూలికలతో ఇంటి వద్దనే నాటు వైద్యం ప్రారంభించారు. నాటు వైద్యం వికటించడంతో సహదేవ్ అస్వస్థతకు



సహదేవ్ (ఫైల్)

గురయ్యారు. ఆయనకు నయం చేసేందుకు ఒడిశా రాష్ట్రంలోని పాముల పుట్టు గ్రామానికి చెందిన మరో నాటు వైద్యుడిని కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు.

ఆయన కూడా వనమూలికలతో వైద్యం ప్రారంభించారు. మంటల్లో కాల్చిన కత్తిపై మూలికలు వేసి సహదేవ్ ముఖం మీద ఊదారు. దట్టంగా పొగలు రావడంతో ఊపిరాడక సహదేవ్ సహా ఒడిశా నాటు వైద్యుడూ అస్వస్థతకు గురయ్యారు. గంట వ్యవధిలోనే ఇరువురూ మృతి చెందారు. పాత్రికేయుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్ఐ మనోజ్ కుమార్, సిబ్బంది గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. నాటు వైద్యానికి ఉపయోగించిన వస్తు సామగ్రి, ఇనుప కడియాలు, శంఖం, వనమూలికలను స్వాధీనం చేసుకున్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

జిఓ 117ను రద్దు చేయాలి

- పాడేరులో యుటిఎఫ్ కార్యాలయం ప్రారంభోత్సవంలో కెఎస్ఎస్.ప్రసాద్

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఉపాధ్యాయ పోస్టులు తగ్గించేందుకు తీసుకొచ్చిన జిఓ 117ను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఆ జిఓ రద్దుకు టిడిపి ఇచ్చిన హామీని గుర్తు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయాన్ని ప్రసాద్, ఆఫీసు గదిని రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.కిశోర్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ... ఏజెన్సీలో శత శాతం ఉద్యోగాలను ఆదివాసీలకు కల్పించే జిఓ 3ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల తమ ప్రభుత్వం సానుకూలంగా ఉంటుందని అధికారపక్ష నేతలు చెబుతున్నారని, త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఉపాధ్యాయ సమస్యలపై చర్చలు జరుపుతామని చెప్పారని తెలిపారు. సమస్యల పరిష్కారం పట్ల చర్చల్లో ప్రభుత్వం స్పందించే తీరు సానుకూలమా, ప్రతికూలమా అన్నది గమనించాక భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవడం, సమస్యలను పరిష్కరించుకోవడం ఉపాధ్యాయుల పోరాటాల మీదనే ఆధారపడి ఉందన్నారు. ఆగస్టు 9వ తేదీ నాటికి 50 ఏళ్లను సంఘం పూర్తి చేసుకుంటున్న తరుణంలో యుటిఎఫ్ స్వర్ణోత్సవాల కార్యక్రమాన్ని కాకినాడలో 50 వేల మంది ఉపాధ్యాయులతో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.విల్సన్‌బాబు, వి.మహేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు టి.చిట్టిబాబు, సహ అధ్యక్షులు చీకటి నాగేశ్వరరావు, పి.దేముడు కె.రఘునాధ్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ పిజి వాయిదా వేయడం కేంద్రం అసమర్థత : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నీట్ పిజి పరీక్షను 12 గంటల ముందు వాయిదా వేయడమనేది కేంద్ర ప్రభుత్వం అసమర్థత అని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ విమర్శించింది. కేంద్రం నిర్ణయాన్ని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేపర్ లీకేజ్‌లు, పరీక్షల వాయిదాల చుట్టూ విద్యా వ్యవస్థను కేంద్రం అపహాస్యం చేస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ సందర్భంలో వైద్యశాస్త్ర నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (ఎన్‌బిఇఎంఎస్) నీట్ పిజి పరీక్ష నిర్ణీత సమయానికి 12 గంటల ముందు వాయిదా వేయడంతో పరీక్ష నిర్వహణలో కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యం అర్థమవుతుందని తెలిపారు. కేంద్ర మంత్రిత్వశాఖ, ఎన్‌బిఇఎంఎస్ చేస్తున్న విద్యార్థి వ్యతిరేక కార్యకలాపాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కంటితుడుపు చర్యగా ఎన్‌టిఎ డైరెక్టరును తొలగించడం వల్ల విద్యార్థులకు జరిగిన నష్టాన్ని పూడ్చలేరని తెలిపారు. ఎన్‌టిఎ, ఎన్‌బిఇఎంఎస్‌లను తక్షణమే పూర్తిగా రద్దు చేయాలని కోరారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సిఎస్ఐఆర్-యుజిసి నెట్, నీట్ పిజి పరీక్షలను వాయిదా వేయడం వల్ల నష్టపోయిన విద్యార్థులకు ప్రభుత్వం పూర్తి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సరైన చర్యలు తీసుకోకుంటే విద్యార్థులు తమ హక్కుల కోసం పోరాడతారని కేంద్రప్రభుత్వాన్ని హెచ్చరించారు.



హోం మంత్రికి శ్రీవారిని చిత్రపటాన్ని అందిస్తున్న స్థానిక నాయకులు

అక్రమంగా నిర్మించిన వైసిపి కార్యాలయాలను తొలగిస్తాం

- హోం మంత్రి వంగలపూడి అనిత

ప్రజాశక్తి- తిరుమల:

ప్రభుత్వ భూములలో అక్రమంగా నిర్మించిన వైసిపి కార్యాలయాలను తొలగిస్తామని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. తిరుమల శ్రీవారిని ఆదివారం విఐపి దర్శన సమయంలో సందర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మహిళలకు పూర్తి భద్రత అందిస్తామని, మహిళలే ఎన్‌డిఎ కూటమికి భారీ సంఖ్యలో ఓట్లు వేసి అఖండ మెజార్టీని కల్పించారని చెప్పారు. వైసిపి ప్రభుత్వం ఆంధ్రరాష్ట్రాన్ని గంజాయి రాష్ట్రంగా తీర్చిదిద్దని మండిపడ్డారు. గంజాయిని పూర్తిగా అరికట్టి యువతను కాపాడతామని పేర్కొన్నారు. అంతకు ముందు అలిపిరిలో సప్తగోప్రదక్షిణ మందిరంలో వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. గోవులకు గ్రాసం అందించారు. ఆమె రాష్ట్ర హోంమంత్రి హోదాలో తిరుమలకు రావడం ఇదే తొలిసారి. మంత్రి వెంట టిడిపి నాయకులు కేశవులు ఉన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమలలో సందర్శకుల రద్దీ కొనసాగుతుంది. శ్రీవారి దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో ఆదివారం మొత్తం కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్ లేనివారికి శ్రీవారి సర్వదర్శనానికి కోసం 24 గంటల సమయం పడుతోందని జెఇఓ వీరబ్రహ్మం తెలిపారు. దర్శన క్యూలైన్లలో ఉన్న సందర్శకులకు కావాల్సిన ఏర్పాట్లను, అందుతున్న సౌకర్యాలు ఆయన పరిశీలించారు. శనివారం శ్రీవారిని 74,467 మంది దర్శించుకున్నారు. 40,005 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. ఇక హుండీ ఆదాయం రూ.3.77కోట్లు వచ్చాయని తెలిపారు.




బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలి

- టిఎన్‌యుఎస్ అధ్యక్షులు శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

117 జిఓను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టిఎన్‌యుఎస్) అధ్యక్షులు మన్నం శ్రీనివాస్ కోరారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. 117 జిఓ వల్ల వేల సంఖ్యలో ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయని, కొన్ని మూతపడే దశలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాథమిక పాఠశాలల విలీనం రద్దు చేసే జిఓను రద్దు చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన టిడిపి అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పట్ల టిడిపి ప్రభుత్వానికి పూర్తిగా అవగాహన ఉందని, పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు, కోశాధికారి పినాకపాణి, గౌరవాధ్యక్షులు ఎం రజనీబాబు నాయుడు, కె రామలింగప్ప, సిహెచ్ పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



"పుస్తకాలు నా హృదయానికి
రెక్కలనిచ్చాయి. నేను బురద నుంచి
బయట పడ్డానికి ఎంతగానో
తోడ్పడ్డాయి. పుస్తకాలను చదవ
కుండా ఉంటే - నా చుట్టూ ఉన్న మౌఢ్యంలోనూ,
నీచంలోనూ మునిగిపోయి ఉండేవాణ్ణి.
విశాలమైన ప్రపంచాన్ని పుస్తకాలు నా ముందు
పరిచాయి."

– మాగ్జిం గోర్కి



'నీటో'పాఖ్యానం

నడక చేత గాని అసమర్ధులే
బాటసారుల కళ్ళల్లో దుమ్ము గొట్టి
దారిని మాయం చేస్తారు
శ్రమకు శత్రువులైన పరాన్నభుక్కులే
కపట మంత్రాలను వల్లిస్తారు
పదిమంది కష్టాన్ని కొల్ల గొట్టి
పండగ జేసుకోవడమే
నేటి యుగధర్మం!
అధికారగణం ఆదమరిచి నిద్రపోతుంటే
కంటికి తెలియకుండా
చూపును కూడా అపహరించవచ్చు
జ్ఞానాన్ని చెరబట్టి లక్ష్మీపుత్రుల శయ్యలపై
రహస్యంగా వేలం పాట పాడవచ్చు
జ్ఞానం శీలానికి వెలకట్టి
సృష్టించిన అక్రమార్కుల మాఫియాతో
లక్షల ఆకాంక్షలను ఛిద్రం చేయవచ్చు
'లీకు వీరు'ల స్వార్ధ తాపంతో
చెలరేగిన ఈ నిశ్శబ్ద భూకంపంలో
కుప్పకూలిన స్వప్న సౌధాల శిధిలాల నడుమ
బిక్కు బిక్కు మంటున్న కన్నీళ్ళు
చౌరస్తాలో ప్రతిధ్వనించే ప్రశ్నలకు
చెవులు మూసుకొని, గుంజిళ్ళు తీస్తే లాభం లేదు
లేమిబిడ్డల్లో ఆశలు రేపి
కలిమి బాబులకు కన్నుగీటే
'నీట్' లెస్ విద్యా వైపరీత్యానికి
ఏ చట్టసభ బాధ్యత వహిస్తుంది ?
ప్రవేశద్వారం చుట్టూ పొంచి ఉన్న ప్రమాదాలను
ఏ దర్యాప్తు పసిగడుతుంది?
కుళ్ళిపోయిన చెట్టు తొర్రలో నుంచి
ఉబికి వచ్చే పురుగులను
ఏ ధర్మాసనం మట్టు పెడుతుంది?
ఘనత వహించిన మేధావులారా!
విశ్వవిఖ్యాత ప్రభువులారా!
మేలి విత్తనాలను, తాలు గింజలను
జాగ్రత్తగా ఎలా జల్లెడ పట్టాలో
మా ఊరి పొలంలో
పచ్చని చెమట కాలువై ప్రవహిస్తున్న
కూలితల్లి నడిగి తెలుసుకోండి!

– కోయి కోటేశ్వరరావు
94404 80274

చెప్పు

రోజూ వేసుకునేవే కానీ, ఈరోజు ఎందుకో
చెప్పులు ముద్దొస్తున్నాయి!
ఒకటికి రెండు మార్లు తుడిచి
చిన్నగా మరకాలుంటే తడి గుడ్డతో మరీ తుడిచి
రోజూ విసురుగా వేసుకునే వాటిని
నెమ్మదిగా నేలపై వుంచి వేసుకుని
మెత్తగా మెల్లగా నడిచాను!

విసిరినది నా చెప్పు కాకపోవొచ్చు
కానీ. అప్పుడు ఆ మొఖంలో
వచ్చిన కంగారు చూసి
ఏ చెప్పును చూసినా ఆ చెప్పులాగే అనిపిస్తోంది!

ఆ విసిరిన గుండెకు
అలాయి బలాయ్ చెప్పాలనుంది
ఆ చేతిని తాకి ముద్దాడాలని వుంది!

(వారణాసి సంఘటన ప్రేరణగా)
– కెక్యూబ్ వర్మ
94934 36277



చేరుతారు

చేరుతారు
ఏదోవొక రోజు బాధితులంతా
ఒకవైపు చేరుతారు
వాళ్ల కాళ్ల కింద నువ్వు అమర్చిన
మందుపాతరల గురించి
వాళ్లు ఆరా తీస్తారు
కాకుల్లాంటి వాళ్ల వాళ్లనే కొల్లగొట్టి
నువ్వు వాళ్లల్లో కొందర్ని
గద్దల్లా పెంచి పోషిస్తున్న
కుట్రల గురించి తెలుసుకుంటారు

నువ్వు వాళ్లను మోసం చేసి
వాళ్లనే నీ పీఠానికి
నాలుగు కాళ్లుగా అమర్చుకున్నావని కూడా
వాళ్లు త్వరలోనే తెలుసుకుంటారు

చేరుతారు
ఒక చోట చేరి తీరుతారు
వాళ్లింతకాలం
నీ కుట్రలూ కుతంత్రాలతో
ఎంత మోసపోయారో
ఏమి కోల్పోయారో
స్పష్టంగానే తెలుసుకుని
వాళ్లందరూ చేతులు కలుపుకుంటారు

బిగించిన పిడికిళ్లయి
నీ పీఠాన్ని ఒక్క ఒక్క గుద్దు గుద్ది
నిన్ను కిందికి పడదోసే
చైతన్యరూపమై కదులుతారు

చేరుతారు
ఏదోవొక రోజు
బాధితులంతా ఒక చోట చేరుతారు
అప్పుడు నీ ఆనవాళ్లు
కనీసం వాళ్ల కాళ్లకింద
దుమ్ముగా కూడా మిగలవు

– చిత్తలూరి

సంజీవిని స్పర్శ డా.ఎన్.గోపి స్మృతి కవిత్వం

సందర్భం



మనతో ఉన్నవాళ్ళు, మన చుట్టూ ఉన్నవాళ్ళు, పరిచయస్తులు మనల్ని గాని, కాలాన్ని గాని ప్రభావితం చేసిన వాళ్ళు కాలం చేస్తే తీవ్రమైన బాధ కలుగుతుంది. అది హృదయాన్ని గాయం చేస్తుంది. ఆ బాధకు మామూలు వ్యక్తులు కన్నీరు కారుస్తారు. కవులైతే కవిత్వం అల్లుతారు. అక్షరాలకు దుఃఖాన్ని పూస్తారు. మరణించిన వారి స్మృతిలో కవిత్వం రాసి చరిత్రలో అనేక మంది కవులు వారిని అక్షరాల్లో సజీవంగా నిలిపారు. ఇప్పటివరకు 28 కవితా సంపుటాలు రచించిన డాక్టర్ ఎన్.గోపి తన కవిత సంపుటాల్లో - భౌతికంగా దూరమైన సన్నిహితులను, లోకహితులను, సమాజ ప్రఖ్యాతులను జ్ఞప్తికి తెచ్చుకుంటూ కవిత్వంలో రికార్డు చేశారు. ఆయన స్మృతి కవితల్లో కలత పడిన మనసు కనిపిస్తుంది. అక్షరాల నుంచి జ్ఞాపకాలు బొట్లు బొట్లుగా కురుస్తూ ఉంటాయి.

తన తల్లి లక్ష్మమ్మ గారి చితి దగ్గర కూర్చుని 'అమ్మ రుణం' అనే కవిత రాశానని ఆయనో పత్రికలో చెప్పారు. "అమ్మ కూడా చచ్చిపోతుంది/ యౌవ్వన ప్రాదుర్భావ ప్రాంగణంలో / విచ్చిన మృత్యు పుష్పాలు / గుట్టుగా కళ్ల మడతల్లోకి / వచ్చి చేరిన స్వార్ధ భాష్పాలు / అమ్మను కాస్త కాస్త చంపుతూ / ఇవాళ పూర్తిగా చంపేశాయి" (అమ్మ రుణం) అంటూ అమ్మ చనిపోదని, కాలుతున్న కాష్టం నుంచి వెలుగుల ప్రసారం చేస్తూనే ఉంటుందని అమ్మని ఓ స్మృతి దీపంగా కవి భావిస్తారు. ఈ కవితలో రాసిన ముగింపు వాక్యం గొప్పది. "భ్రష్టుడా, అమ్మ రుణం తీరదు / అమ్మకు అమ్మవై పుడితే తప్ప" అంటూ అమ్మని చివర చూపు కూడా చూడలేని క్షణంలో తనలో కలిగిన భావావేశమే ఈ కవితని ఆయన పేర్కొంటారు. అమ్మ దూరమైనా సరే ఆమె నేర్పిన అక్షరాలు, ఆమె నుంచి నేర్చుకున్న లక్షణాలు తనను నడిపిస్తున్నాయని అంటారు.

అలాగే తన తండ్రిని గుర్తు చేసుకుంటూ రాసిన కవిత 'నాయన యాది'. అందులో తన నాన్న ఊరు తిరిగి వ్యాపారం చేసి తమ జీవితాలను నిలిపిన వాడిగా చెప్పుకుంటారు. 'అనేక ఊర్లు తిరిగిన ఆయన పాదాల ముందు నా కవిత్వ పాదాలు ఎంత?' అని తండ్రి ఔన్నత్యాన్ని, శ్రమజీవన తత్వాన్ని చాటుతాడు. ప్రాణానికి ప్రాణమైన తన కూతురు ఆయన ప్రపంచాన్ని ఖాళీ చేసి వెళ్లిపోయిన సందర్భంలో 'మా అమ్మాయి' అనే శీర్షికతో కవిత రాశారు. తన జీవితంలోకి కలలా వచ్చిన అమ్మాయి పీడ కలలా వెళ్లిపోవడాన్ని తట్టుకోలేకపోయారు. తనకెందుకో ఈ లోకం నచ్చలేదని, తన పాలనవ్వుల వెనక దీపాల కన్నుల లోతుల్లో ఒక అంతర్ముఖి ఉందని తెలుసుకోలేక పోయాననీ, జీవితంలో విజయాలే కాకుండా వైఫల్యాలు కూడా భాగమేనని, తన కూతురికి నేర్పించలేదని, అందుకే అనుభవించు నాన్న అని నిర్దాక్షిణ్యంగా శిక్షించి వెళ్ళిపోయిందని కవి కలత చెందారు.

"క్షణక్షణాల ముళ్ళ మంచం మీద
ఆకాశాన్ని గుండెల మీద మోపి వెళ్లిపోయింది
తనకు తెలియదు
తన మరణం క్షణమైతే

మా మరణం క్షణక్షణం" అంటూ తన హృదయ వేదన వ్యక్తం చేశారు. తమ కంటిముందే పుట్టి, పెరిగి తమలో జీవనోత్సాహాన్ని నింపిన బిడ్డ లోకాన్ని ఖాళీ చేశాక తల్లిదండ్రుల పరిస్థితి ఎలా ఉంటుందో అనుభవించిన వారికే తెలుస్తుంది. మరణించిన వారికి ఆ క్షణం మాత్రమే మరణం, కానీ, ఆ జ్ఞాపకాల్లో నిత్యం జ్వలించే వారికి క్షణక్షణం మరణమే కదా! తలచుకుంటేనే గుండె సముద్రం అవుతుంది.

డాక్టర్ సి.నారాయణరెడ్డి మరణించినప్పుడు రాసిన కవిత 'జననమంత సుందర మరణం'. గోపి గారి ఎలీజిలలో ముఖ్యంగా శీర్షికలోనే ఆ వ్యక్తి స్ఫురణ, స్మరణ కనిపిస్తాయి. ఈ శీర్షికలో 'సుందర' అనే పదం ఒక్కసారిగా సినారె నవ్వుతున్న ముఖాన్ని గుర్తుకు తెస్తుంది. సినారె సాహిత్య సారాంశాన్ని చెబుతూ కవిత ప్రారంభమవుతుంది. ఆయన కవితలు మేఘాల భావోద్వేగాలు. ఆకాశమంత ఆత్మీయత కలిగిన వాడు ఆయన మరణం జననం మంత సుందరమైందని కవి చెబుతూ ... "కన్నీటి విలువ తెలిసినవాడు/ సామాజిక వేదనకు/ మూలాలు గమనించినవాడు/ స్నేహమే దాహంగా బతికినవాడు/ ప్రతిభా పద్మాలకు/ సూర్యరశ్మిని ప్రసరించినవాడు/ ఉల్లోల పౌరష తరంగం/ ఉద్దీన హృదయ విహంగం/ నా వ్యక్తిత్వం తల నిమిరిన వాడు/ నాకు సర్వస్వం కాకుండా / ఎలా ఉంటాడు?" అంటారు. ఈ మాటలను గమనిస్తే చాలు; కవికి, నారాయణ రెడ్డి గారికి ఉన్న అనుబంధాన్ని కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు.

అనేకమంది కవులు మరణించినప్పుడు వారి విశిష్ట వ్యక్తిత్వాలను స్మృతి కవితలుగా రికార్డు చేశారు. ఆ కవితల్లో ఆ కవి మార్గం, కవి వ్యక్తిత్వం సులభంగా తెలుస్తుంది. తేలిక మాటలతో చెబుతూనే భావాన్ని గంభీరంగా చెప్పడం ఆయన రాసిన స్మృతి కవితల్లోని ప్రత్యేక లక్షణంగా గమనించవచ్చు. రాళ్లబండి కవితా ప్రసాద్ గురించి రాస్తూ...

"జ్ఞాపకాల బొక్కెనలు / కన్నీళ్లు తోడేస్తున్నాయి,
కవితా, నీ మరణం/ ఎప్పటికీ తీరని/ చిట్ట చివరి సమస్యా పూరణం" అంటారు. గుడిహాళం రఘునాథం గురించి చెప్తూ "తక్కువ రాసినా/ చక్కని కవిత్వం రాశాడు / కలం చిలకరిస్తే చాలు/ ఆల్కెమీ జాలువారేది" అన్నారు. ఆచార్య తిరుమలని గుర్తు చేసుకుంటూ "రాయకుండా / బతకలేని నువ్వు/ రాయకుండా మరణించడమేంటి" అని దుఃఖంతో కూడిన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తారు. దాశరథి రంగాచార్యులను గుర్తు చేసుకుంటూ, "మాక్సిమం గోర్కి మరోసారి మరణించాడు" అన్నారు. ప్రముఖ కథకులు, సంపాదకులు పతంజలిని గుర్తు చేసుకుంటూ... "పతంజలి పెన్ను ముట్టుకుంటే అతన్ని ముట్టుకున్నట్టే ఉంది. అతని వేళ్ళు నా వేళ్ళలోకి ప్రవహిస్తున్న అనుభూతి" అని రాసుకున్నారు. పుట్ల హేమలత మరణించిన సందర్భంలో- ఆమె జ్ఞాపకాల చలి వెన్నుని వణికించిందని, మనసు మబ్బు పడిందని, సోదరి మరణం పచ్చని చెట్టు ఎండిపోవడంగా భావించారు. తన మిత్రుడు అనువాదకుడు పోలి విజయ రాఘవరెడ్డి వెళ్ళిపోయినప్పుడు- అతను వదిలిన ఖాళీని, వెలితిని గుర్తు చేసుకుంటూ, 'పుస్తకాలు, అక్షరాలు, వార్తా పత్రికలు, నిఘంటువులు దిగులు పడ్డాయ'ని చెబుతాడు. సిరిసిల్ల సాహితీ మిత్రుడు రుద్ర రవి చనిపోయినప్పుడు 'ఎవరికీ చెప్పకుండా' అనే స్మృతి కవిత రాశారు. మరాఠీ కవి నిరంజన్‌ను కూడా తలుచుకున్నారు. తన 'జలగీతా'న్ని మరాఠీలోకి అనువదించినందుకు 'నా కన్నీటి జలగీతమే నివాళిగా అర్పిస్తున్నా'నని ఆర్ధ్రంగా పలికారు.

తన కవి మిత్రుల సహచరులు చనిపోయినప్పుడు కూడా సహానుభూతితో కొన్ని కవితలు రాశారు. ఎండ్లూరి సుధాకర్ భార్య పుట్ల హేమలత మరణించినప్పుడు ఆయన్ని ఓదారుస్తూ "అతని దుఃఖం వీధుల్లోకి దూకిన జలపాతం గాయపడ్డ నీళ్లే కన్నీళ్లు" అంటూ రాశారు. దేవి ప్రియ అర్ధాంగి రాజ్యలక్ష్మి చనిపోయినప్పుడు- "కొన్నాళ్ళకు/ దుఃఖం కూడా అలసిపోతుంది/ చనిపోయిన వారు/ మళ్లీ జీవించడం మొదలవుతుంది/ ఒక్కరు కాదు అనేకులుగా" అంటూ బాధను కవిత్వీకరించారు.

ఇలా ఆయన రాసిన స్మృతి కవితల్లో జీవితాన్ని, మరణాన్ని అర్థం చేసుకున్న తీరు వాటిని తాత్వికంగా చూడటం లాంటి విషయాలు గమనించవచ్చు. ప్రముఖ చిత్రకారుడు బాపు మరణించినప్పుడు - "తెలుగు వాకిళ్లలో / ముగ్గు లాంటివాడు / అతను మాట్లాడడు/ బొమ్మలే మాట్లాడతాయి" అన్నారు. మానవ హక్కుల నేత బాలగోపాల్ మరణించినప్పుడు- "అడిగేవాడు ఒకడుండేవాడు/ ఇప్పుడు లేడు/ అతిని కడిగేసేవాడు ఒకడుండేవాడు/ ఇక రాడు" అని గుర్తు చేసుకున్నారు.

చాలా తక్కువ అక్షరాలను మాత్రమే వాడుతూ, చనిపోయిన వ్యక్తి తాలూకు ముద్రలను గుర్తు చేస్తూ గోపి గారి స్మృతి కవితలు సాగుతాయి. కుల నిర్మూలన సంఘ ఉద్యమకారుడు డి.జి.రామారావును 'సజీవి' అంటూ 'ఆయన నవ్వుతుంటే కులం పెంకలు చిట్లుతున్నట్టు' ఉండేది అనడం ద్వారా సారాంశాన్ని మొత్తం చెప్పినట్టుగానే మనకు తెలుస్తుంది. తన మిత్రుడు ఎలిమినేటి మాధవరెడ్డి లేమిని కూడా స్మృతి కవితగా మలిచారు.

పాలస్తీనా అధ్యక్షుడుగా పనిచేసిన యాసర్ అరాఫత్ స్మృతిలో గోపి అరాఫత్ కి యాద్ మే అనే కవిత రాశారు. అందులో అరాఫత్ వ్యక్తిత్వాన్ని, శాంతి కాముకతను, విరాట్ స్వరూపాన్ని, పోరాట పటిమను సంపూర్ణంగా చిత్రీకరించారు. "అరాఫత్ / ఆకాశమంత వ్యాపించిన అరబ్బు మబ్బువి నువ్వు / కురిసేది నిప్పులనే/ భూగోళం మీద మొలిచిన/ ఒకే ఒక్క చూపుడు వేలు వృక్షానివి నువ్వు / ముష్కరులు సృష్టించిన/ చలి తుఫానులో/ ఈ శతాబ్దం నిండా పరుచుకున్న ఎండవు నువ్వు/ రాలిపోతున్న ఆకులను / మళ్లీ చెట్లకి అతికించే వసంతానివి నువ్వు/ ఆరు రుతువుల్ని/ ఒకే పోరాట ఋతువుగా మలచిన విశాల ఆకాంక్షవు నువ్వు" అని అరాఫత్‌ని ఆవిష్కరించారు. సద్దాం హుస్సేన్ గురించి రాస్తూ "నీ గొంతును ముద్దాడిన ఉరితాడుదే అదృష్టం అంటే / నీ విగ్రహాన్ని / తాళ్లతో కూల్చేశారు/ అయితే ఏంటి / ఇప్పుడు ప్రపంచమంత ప్రతిమ నీది" అని హుస్సేన్ ధైర్యాన్ని తెలిపారు.

తెలంగాణ శకుంతల మరణించినప్పుడు "తెలంగాణ మృత్తిక, సార్థకమైన నీ జీవిక" అంటాడు. ఉదయ్ కిరణ్ అనే హీరో మరణించినప్పుడు, అక్కినేని వెళ్లిపోయినప్పుడు కూడా వారిని తలచుకున్నారు. ప్రపంచంలోని పర్వతాలన్నీ అధిరోహించిన మల్లి మస్తాన్ బాబుని గుర్తు చేసుకుంటూ 'ఒక్కడే' అని నివాళి కవితను ప్రకటించారు. 'మట్టి ఎత్తును ఆకాశం దాకా పెంచిన విశ్వ మానవుడు మన తెలుగు బిడ్డ' అంటూ కీర్తించారు.

గోపి గారి స్మృతి కవితల్లో - 1. మానవ సంబంధాల పలవరింత, 2. వ్యక్తి ఆరాధన, 3. సామాజికత, 4. స్వీయ ఓదార్పు, 5. భావోద్వేగాల వ్యక్తీకరణ, 6. రాజకీయ ఆశయాల కొనసాగింపు, 7. సహానుభూతి, 8. సున్నితత్వం, 9. వ్యక్తిగత జ్ఞాపకాల కలబోత, 10. కరుణ రసాత్మకత ... కనిపిస్తాయి. ప్రతి స్మృతి కవితా మన గుండెలను తడుతుంది, తాకుతుంది. మరణించిన వారి పట్ల కవి ఎంత ప్రేమతో, బాధతో వారిని గుర్తు చేసుకుంటూ రాశారో, అదే దుఃఖం, భావం, బాధ, జ్ఞాపకాలు మనకూ కలుగుతాయి. దుఃఖపు పొరల్లో దాగున్న కన్నీటిని రాయగల నేర్పు గోపీ గారి కవిత్వానికి ఉంది.

(రేపు (జూన్ 25, 2024) : డా.ఎన్.గోపి 75వ జన్మదినోత్సవం)

– డాక్టర్ సుంకర గోపాల్,
94926 38547

విలక్షణ పరిశోధన 'మిత్రసమాసం'



మనుషుల్ని నిషేధించినట్లు భాషను నిషేధించరాదు. భాషను స్వేచ్ఛగా ఎదగనివ్వాలి.
(కొలకలూరి మిత్ర సమాసం - పు14)

ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు కవి. కథ, నవల, నాటక రచయిత, అనువాదకుడు. సాహిత్య విమర్శకుడు. సాహిత్య పరిశోధకుడు. ఇది అందికీ తెలిసిన విషయమే. ఆయన వ్యాకరణాలు ఉపయోగించిన వైరి సమాసం, వైరి వర్గం, దుష్ట ప్రయోగం, గ్రామ్య పదం, దుష్ట సమాసం, మిశ్ర సమాసం వంటి పదాలను పేర్కొన్నారు. వాటికి వ్యాకర్తలు చెప్పిన నిర్వచనాలలోని సామంజస్యాలను చర్చించారు. వైరి సమాస వ్యవస్థను కొలకలూరి శాస్త్రీయంగా పేర్కొన్నారు. తెలుగు వ్యాకర్తలు తెలుగు వ్యాకరణం రాస్తూ సంస్కృతాధిక్యతను ఆమోదించడం ఎంత గౌరవం!" అని ఆశ్చర్యపోయారు. తెలుగు సంస్కృత పదాలు కలిసుండే సంస్కృతంతో చేరిన తెలుగు అనడం తప్పని, తెలుగులో చేరిన సంస్కృతం అనడం ఒప్పని ఆయన పేర్కొన్నారు. సమాసంలోని పూర్వ పర శబ్దాలు సంస్కృత పదాలే అయితే తప్పు లేదు. అవి రెండూ తెలుగు పదాలో, తత్సమ పదాలో అయినా ఫరవాలేదు, కానీ, ఒక సంస్కృత పదమో, తత్సవ పదమో ఉండి తర్వాత తెలుగు పదం ఉంటే దానిని వైరి సమాసం అన్నారు. మొదట తెలుగు పదం, తర్వాత సంస్కృత - తత్సవ పదం ఉంటే మిశ్రమ సమాసం అన్నారు. ఈ పేర్లు ఆ పదాల కలయికను నిరోధించేవిగా ఉన్నాయని కొలకలూరి అభిప్రాయం. వైరి సమాసం అనే మాట సంస్కృత భాషాభిమానంతో పుట్టిందంటారాయన. "ఆదానంతోనే భాషాభివృద్ధి ఉంటుంది" అని కొలకలూరి పేర్కొన్నారు. అంటే ఇతర భాషా పదాలను కలుపుకోవడం ద్వారానే ఏ భాషైనా వృద్ధి

భాషా పరిశోధకుడన్న సంగతి అందరికీ తెలీదు. పరిశోధనకులనగానే మనకు భద్రిరాజు కృష్ణమూర్తి, జీవనరెడ్డి, చేరా, బూదరాజు రాధాకృష్ణ, చిలుకూరి నారాయణరావు వంటి వాళ్ళు స్ఫురిస్తారు. సాహిత్య సృజనకారులు పరిశోధకులైతే సాహిత్య పరిశోధకులవుతారు. వాళ్ళు సాధారణంగా భాషా పరిశోధకులు కారు. కొలకలూరి సృజన రచయితే గాక, సాహిత్య పరిశోధకుడే గాక, భాషా పరిశోధకుడు కూడా కావడం అరుదైన అంశం. ఆయన భాషా పరిశోధన గ్రంథమే 'మిత్ర సమాసం'.

సంప్రదాయ వైయాకరణులు సృష్టించిన 'వైరిసమాసం' అనే భావనను తిరస్కరించి, కొలకలూరి 'మిత్రసమాసం' అనే భావనను సృష్టించారు. అందుకే ఈ పరిశోధన విలక్షణమైనది. విశిష్టమైనది. 'వైరి సమాసం" అనే భావన తెలుగుభాష, ఇతర భాషలతో కలిసి ఉండటాన్ని, తానూ వికాసం పొందటాన్ని అరికట్టుతుందని ఆయన భావించారు. ఒక భాషాపదం మరో భాషాపదంతో కలిసి సమాసంగా రూపొందితే దానిని వైరి సమాసమని నిషేధించవలసిన అవసరం లేదంటారు కొలకలూరి. 'వైరి సమాసాన్ని నిషిద్ధమనే అధికారం ఎవరికీ ఉండరాదు, ఉండదు. వ్యాకర్తలు కొన్ని సమాసాలను దుష్టమనో, వైరి అనో భావించటం అవిచారమూలకం" అంటారాయన.

ఈ పుస్తకంలో 'వైరి సమాసం' అనే జొన్నవిత్తంత అంశాన్ని కొలకలూరి భాషకే పరిమితం చేయకుండా, దానిని సామాజీకరించి, వైరి సమాస భావన అభివృద్ధికరమైనది కాదని సిద్ధాంతం చేశారు. అర్ధవంతమైన భిన్న భాషల విభిన్న పదాలకు ఏకార్థభావం సాధించాలి. "సమాజంలో మనుషుల్ని దూరం చేసుకున్నట్లు సాహిత్యంలో సమాసాలను దూరం చేయవద్దు" అని విజ్ఞప్తి చేశారాయన. ప్రపంచంలో ఏ భాషా స్థిర బిందువు కాదనీ, ప్రతి భాషా ఒక చరబిందువని, ప్రతి భాషలోనూ అనేక ఇతర భాషల పదాలు కలవడం సహజమని, ఆ సహజ ప్రక్రియను వైరి సమాసం పేరుతో నిషేధించడం మంచిది కాదని అంటారాయన. ఒక సమాసం వైరి, శత్రువు కావడం ఏమిటి? అన్నది ఆయన ప్రశ్న. వ్యాకరణ శాస్త్రాలు భాష అభివృద్ధి చెందడానికి ఉపయోగపడాలి తప్ప, భాష కుంచించుకుపోవడానికి అవి సహకరించరాదని కొలకలూరి అభిప్రాయం.

ఈ పరిశోధనలో కవి జనాశ్రయం, ఛందో దర్పణం, ఆంధ్ర శబ్ద చింతామణి, ఆంధ్ర భాషా భూషణం, లక్షణసార సంగ్రహం, బాల వ్యాకరణం, బాల కవి శరణ్యం వంటి తెలుగు చెందుతుందని, ఇందుకు ఆయన ఆంగ్లభాషనే ఉదహరించారు. "ఆంగ్లభాష ఎంత? జానెడంత. ఇప్పుడెంత? బారెడంత. ప్రపంచ భాషలన్నింటినీ తనలో ఇముడ్చుకొని ప్రపంచ భాష అయింది". తెలుగు వ్యాకర్తల తలకిందుల ఆలోచననూ వ్యాఖ్యానిస్తూ "వ్యాకర్తలు, లాక్షణికులు తన తల్లి తెలుగును గూర్చి మాట్లాడుతూ, సంస్కృత మాత సౌందర్యానికి అబ్బురపడే అర్భకులు" అంటూ- వాళ్లే ఈ వైరి సమాస వ్యవస్థను సృష్టించారన్నారు. కొలకలూరి ఈ సందర్భంగా భాషకు సంబంధించిన విధి నిషేధాలు పనికిరావన్నారు.

వ్యాకర్తలు వైరిసమాసం అని వ్యతిరేకంగా పేరు పెట్టినా శాసన కర్తలు, ప్రాచీన కవుల నుంచి నేటి వ్యాపార ప్రకటన కర్తల వరకూ వైరి సమాసాలు ఉపయోగించిన తీరును కొలకలూరి విస్తృతంగా అధ్యయనం చేసి సోదాహరణంగా నిరూపించారు. ఈ అధ్యయనం ఆ పరిశోధన గాఢతకు నిదర్శనం. "తిరస్కారం పురస్కారంతో నిమిత్తం లేకుండా వైరి సమాసం పెరుగుతూ వచ్చింది" అన్నది ఆయన పరిశోధనల ఫలితం. పాల్కురికి సోమనాథుడు ప్రయోగ శీలి. ఆయన వైరి సమాసాలు ప్రజల వ్యవహారంలో ఉన్న వాటిని విస్తృతంగా ఉపయోగించారని వివరించారు. కొలకలూరి వారి నిజాయితీకి నిదర్శనం... పూర్వ కవుల వైరి సమాసాలను తాను గుర్తించడమే కాక, ఇతర విద్వాంసులు గుర్తించిన వాటిని వాళ్ల గుర్తించినట్లు గానే చెప్పడం కనిపిస్తుంది. "వైరి సమాసాలను గ్రహించడం, గుర్తించడం, నిర్మించడం, ప్రయోగించడం సాహిత్యానికి, జీవితానికి అత్యవసరం" అని ప్రాచీన తెలుగు కవుల వైరి సమాస చర్యల సారాంశం. కొలకలూరి వృత్తి పదకోశాల నుంచి, నామవాచకాల నుంచి, సినిమాల నుంచి, సైన్‌బోర్డుల నుంచి, వ్యాపార ప్రకటనల నుంచి వైరి సమాసాలను ఏరి, కుప్ప చేసి వాటిని సమర్ధించారు.

భాషకు మిశ్రమ గుణం సహజమని, ఇతర భాషాపదాలను ప్రతిభాషా అనివార్యంగా తనలో ఇముడ్చుకుంటుందని, అలా చేర్చుకుంటే ఆ భాష సజీవంగా ఉంటుందని, లేకుంటే మృతభాష అవుతుందని కొలకలూరి అభిప్రాయం. వ్యాకర్తల విధి నిషేధాల ప్రకారం కవులు, ప్రజలు నడుచుకోరని ఆయన పరిశోధనలోని ధ్వని.

"నేటి తెలుగు కవులు ఈ సమాస వ్యవస్థను సాహిత్య సౌందర్యం కోసం ప్రయోగించారు. కవులు ప్రయోగశీలురు కదా"

- (కొలకలూరి ఈ గ్రంథం.. పు 14)

– రాచపాళెం చంద్రశేఖర రెడ్డి


ఊరు చుట్టూ అల్లిన అందమైన కథలు

ఒక ప్రాంతంలో జరిగిన సంఘటనలతోనో, ఒక వ్యక్తి జీవితంలో జరిగిన సంఘటనలతోనో బాలసాహిత్యంలో గతంలో కొన్ని కథలు వచ్చాయి. మాల్గుడి కథలు, అక్బర్ - బీర్బల్ కథలు, నిక్షేపరాయుడి కథలు, చింటూ గాడి కథలు ఈ కోవకు చెందినవే. ఇప్పుడు ప్రముఖ బాల సాహితీవేత్త పైడిమర్రి రామకృష్ణ తాను నివసించే 'నాదర్ గుల్' ప్రాంతంలో జరిగినట్లు బాలల కోసం సృష్టించిన కథలే 'నాదర్ గుల్' కథలు.

తెలంగాణా నుంచి బాల సాహిత్యంలో ఎంతోకాలంగా రచనలు, సేవలు అందిస్తూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్నారు రామకృష్ణ. బాలసాహిత్య పరిషత్ కోశాధికారిగా సేవలందిస్తూ ఇప్పటివరకు 700కి పైగా బాలల కథలు రాశారు. తాను రాసిన కొన్ని కథలను మామయ్య డాట్.కాం, అనగనగా ఒక అడవి, రంగులరాట్నం, చింటుగాడి కథలు, మృగరాజు తీర్పు, గుడ్డేలుగు బల్లం, తాంబేలు ఇగురం, జోర్దార్ కతలు సంపుటాలుగా ప్రచురించారు. చింటుగాడి కథలకు పొ.శ్రీ.తె.వి. సాహితీ పురస్కారం అందుకున్నారు. 'బాలసాహితీ శిల్పులు' పేరుతో బాలసాహితీవేత్తల పరిచయాలు ప్రచురించారు.

తాజాగా 'నాదర్ గుల్ కథలు' పేరిట వెలువరించిన సంపుటిలోని కథలు గతంలో వివిధ పత్రికల్లో ప్రచురితమై, పాఠకుల మన్ననలు పొందాయి. ప్రముఖ సీనియర్ రచయిత ఎన్.వి.ఆర్. సత్యనారాయణమూర్తి 'బాల సాహిత్య తపస్వి పైడిమర్రి' పేరుతో ఈ పుస్తకానికి ముందుమాట రాశారు. 'ఉన్న ఊరు, కన్నతల్లి.. సమాజంలో వీటి మీద ఎవరికైనా ప్రేమ ఉండటం సహజం. రచయితలైతే ఏదోఒక సందర్భంలో తమ రచనల్లో ఇది ప్రతిబింబిస్తూ ఉంటుంది. ఇప్పుడు పైడిమర్రి రామకృష్ణ వెలువరించిన 'నాదర్‌గుల్ కథలు' గ్రంథనామం కూడా అలాంటిదే!' అని పేర్కొన్నారు.

ఈ పుస్తకంలోని కథలన్నీ రచయిత నివసించే నాదర్‌గుల్ చుట్టూ అల్లుకున్నవే. మొదటి కథ సాంబడి ఆస్తులు. చివరి కథ జమీందారు కోపం. ఆప్యాయత, అనురాగం, అభిమానం, అభినందన, ఆత్మీయమైన గౌరవం కూడా అమూల్యమైన సంపదలని తెలిపే కథ 'సాంబడి ఆస్తులు'. వంట చేసేవారు మానసికంగా ప్రశాంతంగా, సంతోషంగా వంట చేస్తే, దానికి రుచితోపాటు ఆ వంట తిన్నవారి మనస్సులు కూడా సంతోషంగా వుంటాయి. లేకుంటే భుజించిన వారి మనస్సు కోపతాపాలకు నిలయమవుతుందని తెరిపే కథ 'జమీందారు కోపం'. కూర్చొని తింటే కొండలైనా కరుగుతాయని చెప్పే కథ 'కష్టేఫలి'. అన్నం పెడుతున్న కొలువును కూడా ప్రేమించాలని చెప్పే కథ 'భంజనుడి ప్రేమ'. వేసవిలో పక్షులకు మట్టిపాత్రల్లో నీటిని పెట్టి వాటి దాహం తీర్చమని చెప్పిన కథ 'పక్షుల దీవెనలు'. ఏ పనినీ మధ్యలో వదిలేయకూడదని చెప్పే కథ 'విజయసేనుడి నైజం'. వ్యాయామం శరీరానికి ఎంతో అవసరం. లేకుంటే ఆరోగ్యంతో పాటు శరీర ఆకృతి కూడా దెబ్బతింటుంతని తెలియచెప్పే కథ 'యువరాజు మెచ్చిన దర్జీ'. ఈ సంపుటిలో ఒక కథ తెలంగాణ మాండలికంలో ఉంది. తన ప్రతి కథల సంపుటిలో



ఒక కథ తెలంగాణ మాండలికంలో రాయటం ఈ కథకుడికి అలవాటు.

ఈ సంపుటి నిండా వినూత్న అంశాలతో, బాలలు సొంతంగా చదువుకునే సరళతరం చేసి రాసిన కథలు ఉన్నాయి. ఈ పుస్తకానికి చిత్రకారుడు జయశేఖర్ అందమైన ముఖచిత్రం అందించారు. లోపల ప్రతి కథకూ ఆకర్షణీయంగా బొమ్మ ఉంది. 104 పేజీలున్న ఈ పుస్తకం వెల రూ. 200. రచయితను సెల్ నెం. 92475 64699 కు వాట్సప్ చేసి సంప్రదించవచ్చు.

– ముక్కామల జానకీరామ్
63053 93291

డా.ఎన్. గోపి 'రేపటి మైదానం' ఆవిష్కరణ 25న

సుప్రసిద్ధ కవి డా. ఎన్. గోపి 75వ జన్మదినం సందర్భంగా తాజా కవితాసంపుటి 'రేపటి మైదానం' ఆవిష్కరణ జూన్ 25, మంగళవారం సాయంత్రం 6 గంటలకు పబ్లిక్ గార్డెన్స్, నాంపల్లి, హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం ఎన్‌టిఆర్ ఆడిటోరియంలో జరుగుతుంది. ఆంధ్రజ్యోతి ఎడిటర్ డా.కె.శ్రీనివాస్ ఆవిష్కరిస్తారు. డా.వోలేటి పార్వతీశం అధ్యక్షత వహిస్తారు. ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి అంకితాన్ని స్వీకరిస్తారు. అతిథులుగా ఆచార్య సూర్యా ధనంజయ, డా.సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, డా. ఎస్. రఘు, శ్రీ వంగల హర్షవర్ధన్, డా. ఎస్. జతిన్ కుమార్, కుడికాల వంశీధర్, పుప్పాల శ్రీరామ్, డా.జె.నీరజ పాల్గొంటారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ అధినేత మద్దాళి రఘురాం ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుంది.

30న రాజాం రచయితల వేదిక 113వ సమావేశం

ఈనెల 30 ఆదివారం ఉదయం 10 గంటలకు విజయనగరం జిల్లా రాజాంలో గల విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 113వ సమావేశం జరుగుతుంది. డా.ఆల్తి మోహనరావు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో 'శ్రీనాథసాహిత్య విహంగవీక్షణం' అనే అంశంపై నేతేటి గణేశ్వరరావు ప్రసంగిస్తారు.

– గార రంగనాథం, 98857 58123



ప్రజ్వల్ రేవణ్ణ సోదరుడు, ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణ అరెస్ట్

శివమొగ్గ : జనతాదళ్ (సెక్యులర్) ఎమ్మెల్సీ, ప్రజ్వల్ రేవణ్ణ సోదరుడు సూరజ్ రేవణ్ణను బెంగళూరు పోలీసులు అరెస్ట్ చేశారు. అసహజ లైంగిక వేధింపుల కేసుపై శనివారం అర్ధరాత్రి అతడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. సూరజ్ రేవణ్ణ ఫామ్‌హౌస్‌లో తనను అసహజరీతిలో లైంగికంగా వేధింపులకు గురిచేశారని అరకలగూడ తాలూకాకు చెందిన జెడి(ఎస్) కార్యకర్త ఈ నెల 16న హొలెనరసిపూర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని హసన్‌లోని సిఇఎన్ పోలీస్ స్టేషన్‌కు కొన్ని గంటల పాటు విచారించారు. అనంతరం అరెస్టు చేస్తున్నట్లు జిల్లాకు చెందిన సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. కర్ణాటక మాజీ మంత్రి హెచ్‌డి రేవణ్ణ కుమారుడు సూరజ్ రేవణ్ణ 2022లో హసన్ జిల్లా స్థానిక సంస్థల నుండి శాసనమండలికి ఎన్నికయ్యారు. ఓ వ్యక్తిని లైంగికంగా వేధించడంతో పాటు బెదిరింపులకు దిగినట్లు సమాచారం. సూరజ్, అతని సహచరులపై ఐపిసి సెక్షన్ 377 (అసహజ నేరాలు), సెక్షన్ 342 (తప్పుగా నిర్బంధించడం), సెక్షన్ 506 (నేరపూరిత బెదిరింపు) కింద కేసు నమోదుచేశామని అన్నారు.

జెపి నడ్డాకు సమన్లపై కర్ణాటక హైకోర్టు స్టే

బెంగళూరు : ముస్లింలను లక్ష్యంగా చేసుకొని వీడియోలో అభ్యంతరకరమైన ప్రచారం చేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న బిజెపి అధ్యక్షులు జెపి నడ్డా, పార్టీ ప్రచార విభాగం అధిపతి అమిత్ మాల్వియాలను విచారణకు హాజరు కావాల్సిందిగా సమన్లు జారీ చేయాల్సిన అవసరం లేదని కర్నాటక హైకోర్టు తెలిపింది. విచారణను కొనసాగించవచ్చునని, అయితే వ్యక్తిగతంగా హాజరు కావాలని వీరిద్దరినీ ఒత్తిడి చేయకూడదని న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ ఎస్ దీక్షిత్ ఆదేశించారు. నడ్డా, మాల్వియాలకు గత నెల 8న సమన్లు జారీ చేసిన కర్నాటక పోలీసులు వారిద్దరినీ వారం రోజుల్లో హాజరు కావాలని సూచించారు. బిజెపి కర్నాటక రాష్ట్ర సామాజిక మాధ్యమ హ్యాండిల్స్‌లో మే 4న అప్‌లోడ్ అయిన యానిమేటెడ్ వీడియోపై కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. దీనిని పురస్కరించుకొని ఆ మరునాడే నడ్డా, మాల్వియాలపై ఎఫ్‌ఐఆర్ నమోదైంది. అప్‌లోడ్ చేసిన వీడియోలను మాల్వియా ఆపరేట్ చేశారని, నడ్డా, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు విజయేంద్ర ఆదేశాల మేరకు దానిని షేర్ చేశారని కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది.

విద్యావ్యవస్థను మాఫియాకు కట్టబెట్టిన మోడీ సర్కార్

- ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ : దేశంలోని విద్యా వ్యవస్థను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మాఫియా, అవినీతి వ్యక్తులకు అప్పగించిందని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ ఆదివారం తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ యుజి ప్రశ్నాపత్రం లీక్ అయితే నీట్ -పిజి, యుజిసి-నెట్, సిఎస్ఐఆర్-నెట్ పరీక్షలు రద్దు చేశారని ఆమె సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దేశంలోని ముఖ్యమైన పరీక్షల నిర్వహణను చాలా బాధకరమైన దుస్థితిలోకి బిజెపి నెట్టివేసిందన్నారు. బిజెపి పాలనలో విద్యావ్యవస్థ మొత్తం మాఫియా, అవినీతిపరుల చేతిలో బంధీ అయిపోయిందని ప్రియాంక ఆగ్రహం వ్యక్తం చేశారు.

దేశంలో విద్యను, పిల్లల భవిష్యత్తును అత్యాశపరులు, మతోన్మాద అసమర్ధులకు అప్పగించాలనే రాజకీయ దురహంకారం వల్ల పేపర్ లీక్‌లు, పరీక్షల రద్దు వంటివి చోటుచేసుకుంటున్నాయని ఆమె పేర్కొన్నారు. దీంతో క్యాంపస్‌ల నుండి విద్య అదృశ్యమైందని, రాజకీయ గూండాయిజం విద్యావ్యవస్థ గుర్తింపుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండ

ఇంఫాల్ : మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతూనే ఉంది. తాజాగా ఇరు గ్రూపుల మధ్య తాజాగా కాల్పుల ఘటన చోటుచేసుకుంది. ఇంఫాల్ తూర్పు జిల్లాలోని థమ్నాపోక్పీ, లామ్లాయ్ ప్రాంతాలకు సమీపంలోని కాంగ్‌పోక్పీ జిల్లాలోని కొండపై నుండి శనివారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో కొంతమంది సాయుధ దుండగులు కాల్పులు జరిపినట్లు ఓ పోలీస్ అధికారి తెలిపారు. స్థానిక గ్రామ వలంటీర్లు ఎదురు కాల్పులు జరిపారని అన్నారు. సమాచారం అందుకున్న భద్రతాబలగాలు ఆ ప్రాంతానికి చేరుకున్నాయని, గంట తర్వాత పరిస్థితి అదుపులోకి వచ్చిందని చెప్పారు. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఆ అధికారి తెలిపారు.

ఓట్లు కావాలి... కానీ సీట్లు ఇవ్వద్దు

- ముస్లింలపై వామపక్షేతర పార్టీలన్నిటిదీ అదే దారి
- చట్టసభల్లో నానాటికీ తగ్గిపోతున్న ప్రాతినిధ్యం



న్యూఢిల్లీ : దేశంలో వామపక్షాలు మినహాయిస్తే..అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ముస్లింల ఓట్ల కోసం వెంపర్లాడుతున్నాయే కానీ వారిని చట్టసభలకు పంపేందుకు మాత్రం సుముఖత చూపడం లేదు. హిందూత్వ పార్టీ అయిన బిజెపి తొలి నుంచి ముస్లిం వ్యతిరేకతను నింపుకుంది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌తో పాటు ఇతర బిజెపి యేతర పార్టీలు కూడా ఎన్నికల్లో టిక్కెట్ల కేటాయింపులో ముస్లింలను చిన్నచూపు చూస్తూనే ఉన్నాయి. ఫలితంగా చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం నానాటికీ తగ్గిపోతోంది. పరిస్థితి ఇలాగే ఉంటే దేశంలో ముస్లింలకు రాజకీయ ప్రాతినిధ్యమే లేకుండా చేయాలన్న బిజెపి లక్ష్యం నెరవేరడానికి ఎంతో కాలం పట్టదు.

నరేంద్ర మోడీ నూతన క్యాబినెట్‌లో పది మంది దళితులు, 27 మంది ఇతర వెనుకబడిన తరగతులు, ఐదుగురు మతపరమైన మైనారిటీలు, ఏడుగురు మహిళలకు చోటు లభించింది. ఎన్డీఏ తరఫున సిక్కులెవ్వరూ లోక్‌సభకు ఎన్నిక కాలేదు. ఎన్నికల్లో పోటీ చేసిన ఏకైక సిక్కు రవనీత్ సింగ్ బిట్టూ ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ బిట్టూతో పాటు సిక్కు మతానికే చెందిన రాజ్యసభ సభ్యుడైన హర్‌దీప్ పూరీకి మంత్రి పదవులు లభించాయి. క్రైస్తవుడైన జార్జ్ కురియన్ ఎన్నికల్లో పోటీ చేయనప్పటికీ ఆయనకూ మంత్రిమండలిలో స్థానం కల్పించారు. తన క్యాబినెట్‌లో అన్ని వర్గాలు, మతాల వారికీ ప్రాతినిధ్యం కల్పించిన ప్రధాని నరేంద్ర మోడీ ముస్లింలను మాత్రం పూర్తిగా విస్మరించారు.

ప్రతిపక్షాలదీ అదే దారి

2014 లోక్‌సభ ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీల తరపున 320 మంది ముస్లిం అభ్యర్థులు పోటీ చేశారు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో వీరి సంఖ్య 94కు పడిపోయింది. ప్రస్తుతం పార్లమెంటులోనే కాదు...రాష్ట్రాల శాసనసభల్లో కూడా బిజెపికి చెందిన ముస్లిం ప్రతినిధులెవ్వరూ లేరు. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ కూడా ముస్లింలకు సముచిత స్థానాన్ని ఇవ్వడం లేదు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, గుజరాత్ రాష్ట్రాల నుండి ఆ పార్టీ తరపున ఒక్క ముస్లిం కూడా పోటీ చేయలేదు. ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్‌జెడి, ఎన్‌సిపి 43 మంది ముస్లిం అభ్యర్థులను రంగంలోకి దింపాయి. 2019 ఎన్నికల్లో 115 మంది ముస్లిం అభ్యర్థులు పోటీ చేస్తే తాజా ఎన్నికల్లో వారి సంఖ్య మరింత తగ్గిపోయింది.

పది మందికి సిపిఎం టిక్కెట్లు

ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్‌తో జట్టు కట్టిన సమాజ్‌వాదీ పార్టీ కేవలం నలుగురు ముస్లింలను మాత్రమే పోటీలో నిలిపింది. ఈ కూటమి ప్రధానంగా ముస్లిం ఓటు బ్యాంక్ పైనే ఆధారపడినప్పటికీ..వారిలో తక్కువ మందికే టిక్కెట్లు ఇచ్చింది. బీహార్‌లో ముస్లింల ఓట్ల కోసం ఆరాటపడిన ఆర్‌జెడి కూడా కేవలం ఇద్దరికే టిక్కెట్లు కేటాయించి చేతులు దులుపుకుంది. 2014లో ఆరుగురికి, 2019లో ఐదుగురు ముస్లింలకు ఈ పార్టీ టిక్కెట్లు కట్టబెట్టింది. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ కూడా ముస్లిం ఓట్ల కోసమే వెంపర్లాడింది. కానీ ఆ వర్గం నుండి కేవలం ఆరుగురినే బరిలో నిలిపింది. సిపిఎం మాత్రం ఈ పార్టీలన్నింటికీ భిన్నంగా ముస్లింలకు టిక్కెట్ల కేటాయింపులో పెద్ద పీట వేసింది. బెంగాల్ నుండి ఐదుగురిని, కేరళ నుండి నలుగురిని, తెలంగాణ నుండి ఒకరిని...మొత్తం పది మంది ముస్లిం అభ్యర్థులను నిలబెట్టింది. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ముస్లిం ఓట్ల కోసం ప్రయత్నించాయే తప్ప టిక్కెట్ల కేటాయింపులో మాత్రం పట్టించుకోలేదని, పూర్తిగా విస్మరించాయని అశోకా యూనివర్సిటీకి చెందిన రాజకీయ శాస్త్రవేత్త, చరిత్రకారుడు అలీ ఖాన్ మహమూదాబాద్ చెప్పారు.

కాంగ్రెస్ తరపున 19 మందే

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 19 మంది ముస్లింలకు పార్టీ టిక్కెట్లు ఇచ్చింది. ఆ పార్టీ తరపున పోటీ చేస్తున్న ముస్లింల సంఖ్య నానాటికీ తగ్గుతూ వస్తోంది. 2014లో 31 మందిని, 2019లో 27 మందిని నిలిపిన ఆ పార్టీ తాజాగా 19 మందిని మాత్రమే పోటీకి దింపింది. వీరిలో ఆరుగురు పశ్చిమ బెంగాల్ నుండే పోటీ చేశారు. 2019 ఎన్నికల్లో ఈ రాష్ట్రం నుండి 10 మంది ముస్లిం అభ్యర్థులు కాంగ్రెస్ తరపున బరిలో నిలిచారు. ఉత్తరప్రదేశ్, బీహార్, అసోం, ఆంధ్రప్రదేశ్ నుండి ఇద్దరు చొప్పున, కర్ణాటక, ఒడిషా, కేరళ, తెలంగాణ, లక్షద్వీప్ నుండి ఒక్కొక్క ముస్లిం కాంగ్రెస్ తరపున పోటీ చేశారు.

విద్వేష ప్రసంగాలతో విషం చిమ్మారు

ఎన్నికల ప్రచారం సందర్భంగా బిజెపి నేతలు ముస్లింలపై కావాల్సినంత విషం చిమ్మారు. సమాజంలోని ఇతర వర్గాల వారిలో వారి పట్ల ద్వేషాన్ని నింపారు. విద్వేష ప్రసంగాలు చేశారు. హింసకు తెగబడ్డారు. గోవును వధిస్తారంటూ దుష్ప్రచారం చేశారు. లవ్ జిహాద్ ప్రస్తావన సరేసరి. సాక్షాత్తూ ప్రధాని మోడీ, ఆయన క్యాబినెట్ సహచరులు ముస్లింలను లక్ష్యంగా చేసుకొని రెచ్చగొట్టేలా ప్రసంగించారు. వారిని చొరబాటుదారులని, అవిధేయులని, లవ్ జిహాదీలని, ఏదో ఒక రోజు హిందూ మెజారిటీని దాటేయాలన్న కుట్రతో అధిక సంతానాన్ని కంటున్నారని...ఇలా పలు నిందలు వేశారు. ప్రధానమంత్రే ఇలాంటి మాటలంటుంటే మంత్రులు, ఇతర సీనియర్ నేతలు ఊరుకుంటారా? వారూ రెచ్చిపోయారు. ముస్లింలను ఉగ్రవాదులు, నేరస్థులు, మాఫియాగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వర్ణించారు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఓ అడుగు ముందుకు వేసి 'నాలుగు సార్లు వివాహం చేసుకునే బిజినెస్‌కు స్వస్తి చెబుతామ'ని హామీ ఇచ్చారు. ముల్లాలను ఉత్పత్తి చేసే దుకాణాలు మూసేస్తామంటూ మదర్సాలను ఉద్దేశించి హెచ్చరికలు జారీ చేశారు. మోడీ అటు ముస్లింలతో పాటు ఇటు కాంగ్రెస్ పార్టీపై కూడా అసత్య ఆరోపణలు చేశారు. ఆ పార్టీ హిందువుల సంపదను ముస్లింలకు దోచిపెడుతుందని ఆరోపించారు.

మ్యానిఫెస్టోలూ అంతే...

ఇక వామపక్షాలు మినహా మిగిలిన ప్రతిపక్ష పార్టీలన్నీ తమ ఎన్నికల ప్రచారంలో దేశంలోని ప్రధాన సమస్యలను ప్రస్తావించాయే తప్ప ముస్లింల ఊసే ఎత్తలేదు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ముస్లింలు అనే మాటే కన్పించలేదు. కాంగ్రెస్ మాత్రమే కాదు...దాదాపు అన్ని ప్రతిపక్ష పార్టీలు ముస్లిం పౌరుల రాజ్యాంగ హక్కులను పరిరక్షిస్తామని తమ మ్యానిఫెస్టోల్లో ఒక్క హామీ కూడా ఇవ్వలేకపోయాయి.

జనాభాకు తగినట్లు లేని ప్రాతినిధ్యం

జనాభాలో తమ వాటాకు తగినట్లు ముస్లింలు లోక్‌సభలో ఎన్నడూ ప్రాతినిధ్యం పొందలేకపోయారు. దేశంలో తొలిసారి సార్వత్రిక ఎన్నికలు జరిగిన 1952వ సంవత్సరం నుండి సగటున 6% మంది ముస్లింలు మాత్రమే చట్టసభ సభ్యులయ్యారు. గతంలో బిజెపి యేతర ప్రభుత్వాలు ఏర్పడినప్పుడు ముస్లింలను కొంతమేర రాజ్యసభకు పంపేవి. దీంతో ఎగువ సభలో సగటున 10.5% మంది ముస్లిం సభ్యులు ఉండే వారు. పార్లమెంట్ ఉభయ సభలు, వివిధ రాష్ట్రాల శాసనసభల్లో కలిపి ముస్లింల ప్రాతినిధ్యం 1980వ దశకం మధ్య నుండి తగ్గుతూ వస్తోంది. 1980వ దశకం మధ్యలో దేశ జనాభాలో 11% మంది ముస్లింలు ఉంటే పార్లమెంటులో 9% ఉండే వారు. అయితే ఆ తర్వాత ఉభయ సభల్లో ముస్లింల సంఖ్య వారి జనాభాకు ఏనాడూ తగినట్లు లేదు. 1998లో 29 మంది, 1999లో 32 మంది, 2004లో 36 మంది, 2009లో 30 మంది ముస్లింలు పార్లమెంటులో ప్రవేశించారు. 2014, 2019లో వారి సంఖ్య మరింతగా పడిపోయింది. 2014లో దేశ జనాభాలో ముస్లింలు 14% మంది ఉన్నారని అంచనా. దీనిని బట్టి పార్లమెంటులో వారికి 75 మంది ప్రతినిధులు ఉండాలి. కానీ 23 మంది మాత్రమే ఉన్నారు. 2019లో ఈ సంఖ్య 25కు మాత్రమే పెరిగింది. 2019 ఎన్నికల తర్వాత దేశ జనాభాలో ముస్లింలు కనీసం 14% మంది ఉన్నారని అంచనా. కానీ లోక్‌సభలో వీరి ప్రాతినిధ్యం కేవలం 5% మాత్రమే. 28 రాష్ట్ర అసెంబ్లీలకు కలిపి 6% మంది ముస్లింలు మాత్రమే ఎన్నికయ్యారు. 18వ లోక్‌సభలో వీరి సంఖ్య కేవలం 24 మాత్రమే.

సంఖ్యా బలం ఉన్నప్పటికీ...

చట్టసభల్లో ముస్లింల ప్రాతినిధ్యం తగ్గడానికి, అదే సమయంలో బిజెపి బలం పుంజుకోవడానికి మధ్య సంబంధం ఉన్నదని పరిశీలకులు అభిప్రాయపడ్డారు. మోడీ హయాం రాకముందు బిజెపి సైతం జాతీయ రాజకీయాల్లో తన ముస్లిం వ్యతిరేకతను బహిరంగంగా బయటపెట్టలేదు. కేవలం ముస్లిం వ్యతిరేకతతోనే ఏ పార్టీ అధికారంలోకి రాలేదు. వందకు పైగా నియోజక వర్గాల్లో ముస్లిం ఓటర్లు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలోని 12 జిల్లాల్లో ముస్లిం జనాభా 90%కి పైగా ఉంది. 70 నుండి 90% ఉన్న జిల్లాలు ఆరు, 60 నుండి 70% ఉన్న జిల్లాలు ఆరు, 50 నుండి 60% ఉన్న జిల్లాలు తొమ్మిది, 40 నుండి 50% వరకూ ఉన్న జిల్లాలు పది ఉన్నాయి. 2014, 2019 ఎన్నికల్లో ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులను సంఘటిత పరచి మోడీ అధికారాన్ని పొందగలిగారు. 2023 నాటికి భారత చరిత్రలోనే తొలిసారిగా అధికార పార్టీకి ఒక్క ముస్లిం మంత్రి కానీ, ఒక్క ముస్లిం పార్లమెంట్ సభ్యుడు కానీ లేకుండా పోయారు.

ఎన్‌డిఎ నుండి ఒక్కరూ గెలవలేదు

తాజా లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి ఒకే ఒక్క ముస్లిం అభ్యర్థికి టిక్కెట్ ఇచ్చింది. భాగస్వామ్య పక్షాలైన జెడియు, ఎజిపి కూడా ఒక్కో ముస్లింను బరిలో దింపాయి. వారందరూ ఓటమి చెందారు. దేశంలో ముస్లింలకు రాజకీయ ప్రాతినిధ్యం లేకుండా చేయాలన్న మోడీ లక్ష్యం చాలా వరకూ నెరవేరిందని రాజకీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ స్కామ్: విద్యా మంత్రి తప్పుకోవాల్సిందే!

- సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్

న్యూఢిల్లీ : అఖిల భారత స్థాయి పోటీ పరీక్షల ప్రక్రియను భ్రష్టు పట్టించిన కేంద్ర విద్యా శాఖ మంత్రి ఆ పదవి నుంచి తప్పుకోవాల్సిందేనని సిపిఎం పునరుద్ఘాటించింది. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో ఆదివారం నాడిక్కడ ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేసింది. కేంద్రీకృత అఖిలభారత పరీక్షా ప్రక్రియలో ఇటీవల చోటుచేసుకున్న దుష్ట పరిణామాలు తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నాయని పొలిట్‌బ్యూరో పేర్కొంది. నీట్ - యుజి, యుజిసి నెట్, ఇప్పుడు నిరవధిక వాయిదా పడ్డ నీట్ - పిజి ఇలా ఏది తీసుకున్నా .. అతీగతీ లేకుండా వేచిచూడాల్సిన దుస్థితి నెలకొనడం పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. వీటన్నింటి అక్రమాల వల్ల దేశంలో ఉన్నత విద్యకు సంబంధించిన ప్రధాన రంగాల ప్రక్రియలన్నీ పూర్తిగా కుప్పకూలిపోయాయని పొలిట్‌బ్యూరో పేర్కొంది. వ్యవస్థలన్నీ ఇలా భ్రష్టు పట్టడానికి ప్రాథమిక నిరూపితమైన అవినీతి ఒక్కటే కారణం కాదని తెలిపింది. కేంద్రం తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానంలో కేంద్రీకరణ, వ్యాపారీకరణ, మతతత్వీకరణ ప్రధానం కావడం వల్లే ప్రస్తుత వినాశకర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని సిపిఎం పేర్కొంది. వ్యాపం కుంభకోణం తరహాలోనే దీనిని మసిపూసి మారేడు కాయ చేసేందుకు, తన తప్పిదాలన్నిటినీ కప్పిపుచ్చుకునేందుకే కేంద్రంలోని కొత్త ప్రభుత్వం ఇప్పటికే నిర్ధారణ అయిన పరీక్షల కుంభకోణాలపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశించినట్లు కనిపిస్తోందని విమర్శించింది.

ఉన్నత విద్యా వ్యవస్థలో కేంద్రం అనుసరించిన విధానపర నిర్ణయాల ఘోర వైఫల్యాన్ని పరీక్షల వ్యవస్థలు కుప్పకూలిపోవడం ప్రతిబింబిస్తోందని, దీనికి ప్రభుత్వం యావత్తూ బాధ్యత వహించాలని, ప్రత్యేకించి విద్యాశాఖ మంత్రి బాధ్యత వహించాలని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఆయన తక్షణమే రాజీనామా చేయాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.

సువిశాలమైన, వైవిధ్యమైన భారత్ వంటి దేశంలో ఉన్నత విద్యా పరిపాలనను కేంద్రీకరించడం ఏమాత్రం పొసగదని, కేంద్రీకృత విధానాన్ని తక్షణమే వికేంద్రీకరించాలని కోరింది. ఇందులో మొదటి అడుగుగా కేంద్రీకృత నీట్ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. వృత్తి విద్యా సంస్థల్లో ప్రవేశాలను నియంత్రించేందుకు ప్రతి రాష్ట్రం తనకు అనువైన ప్రత్యేక ప్రక్రియలను, విధానాలను అనుసరించి ప్రవేశ పరీక్షలను నిర్వహించేందుకు అనుమతించి తీరాలని పొలిట్ బ్యూరో డిమాండ్ చేసింది.

బిఎస్‌పి సమన్వయకర్తగా ఆకాశ్ ఆనంద్



లక్నో : ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో ప్రత్యేక ముద్ర వేసిన బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) జాతీయ సమన్వయ కర్తగా ఆకాశ్ ఆనంద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బిఎస్‌పి అధినేత్రి మాయావతికి ఆకాశ్ స్వయాన మేనల్లుడు. లక్నోలో ఆదివారం జరిగిన బిఎస్‌పి జాతీయ స్థాయి సమావేశంలో ఆకాశ్‌ను పార్టీ జాతీయ సమన్వకర్తగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆకాశ్ ఆనందే తన వారసుడని మాయావతి స్పష్టం చేశారు. కొద్ది రోజుల కిందట ఆకాశ్ ఆనంద్‌పై వేటు వేసిన మాయావతి తిరిగి ఆయనకే పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించడం విశేషం. 'బిఎస్‌పి జాతీయ అధ్యక్షులు మాయావతి మరోసారి ఆకాశ్ ఆనంద్‌కు పార్టీలో పూర్తి పరిణితితో పనిచేసే అవకాశం కల్పించారు. ఆయన మునుపటిలా పార్టీలో తన పదవులన్నింటినీ కొనసాగిస్తారు' అని బిఎస్‌పి ఒక ప్రకటనలో తెలిపింది. తన మేనల్లుడు ఆకాశ్ పరిణితి చెందిన నాయకుడిగా ఎదగాలని ఆశిస్తున్నట్లు మాయావతి తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా బరిలో దిగిన బిఎస్‌పి, యుపిలోని 80 స్థానాలకు గాను ఒక్క సీటు కూడా గెలవలేదు.



కేరళ ఎస్సీ, ఎస్టీ, సంక్షేమ శాఖ మంత్రిగా ఒఆర్ కేలు ప్రమాణం

తిరువనంతపురం : కేరళ రాష్ట్ర షెడ్యూల్డ్ తరగతులు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల సంక్షేమ శాఖ మంత్రిగా ఒఆర్ కేలు ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో గవర్నర్ ఆరిఫ్ ముహమ్మద్ ఖాన్ ఆయన చేత ప్రమాణం చేయించారు. ఈ కార్యాక్రమానికి ముఖ్యమంత్రి పినరయి విజయన్, మంత్రివర్గ సహచరులు హాజరయ్యారు. ఒఆర్ బాలు మనంతవాడి నియోజకవర్గం నుంచి రాష్ట్ర శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రమాణస్వీకారం చేసిన అనంతరం సచివాలయం నార్త్ బ్లాక్‌లోని కార్యాలయానికి వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. ఆయన భార్య శాంత, పిల్లలు మిథున, భావన, ఇతర బంధువులు కూడా ఈ వేడుకకు హాజరయ్యారు.

ఇదివరకు ఈ శాఖ మంత్రిగా ఉన్న దళిత్ శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) జాతీయ నాయకులు కె రాధాకష్ణన్ పార్లమెంటుకు ఎన్నికకావడంతో ఆయన స్థానంలో ఒఆర్ కేలు కేబినెట్‌లోకి వచ్చారు. రెండు దశాబ్దాలకు పైగా కేలు ప్రజాప్రతినిధిగా సేవలందిస్తున్నారు. తిరునెల్లి గ్రామ పంచాయతీలోని ఎడయూర్‌కున్ వార్డులో 2000 సంవత్సరంలో ప్రజాప్రతినిధిగా గ్రామ పంచాయతీ సభ్యునిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. సిపిఎం రాష్ట్ర కమిటీలో వయనాడ్ జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించిన తొలి గిరిజన నాయకులు కేలు కావడం విశేషం. గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా పలు గిరిజనోద్యమాలకు ఆయన నేతృత్వం వహించారు. ప్రస్తుతం మనంతవాడి (ఎస్‌టి) నుంచి ఆయన శాసనసభ సభ్యునిగా ఉన్నారు. కురిచ్య కమ్యూనిటీకి చెందిన ఆయన ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై శాసనసభ కమిటీకి ఛైర్మన్‌గానూ, కేరళ పశు, పశు సంవర్ధక శాస్త్ర విశ్వవిద్యాలయ మేనేజ్‌మెంట్ బోర్డు సభ్యునిగానూ పనిచేస్తున్నారు.

తిరునెల్లి గ్రామ పంచాయతీకి 2005 మరియు 2010లో వరుసగా 10 సంవత్సరాలు అధ్యక్షులుగా సేవలందించారు. అనంతరం 2015లో తిరునెల్లి డివిజన్ నుంచి మనంతవాడి బ్లాక్ పంచాయతీ సభ్యులుగా ఎన్నికయ్యారు. 2016లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి పికె జయలక్ష్మిపై మనంతవాడి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో మనంతవాడి నుంచి మళ్లీ ఎన్నికయ్యారు.

ఉత్తర గాజాపై భీకర దాడులు

- 39 మంది పాలస్తీనీయుల మృతి



శనివారం అల్ -షతి శరణార్థి శిబిరంపై ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో కూలిన భవనాల శిథిలాల గుండా వెళ్తున్న పాలస్తీనీయులు

గాజా : అమెరికా, ఇతర పశ్చిమ దేశాల మద్దతుతో ఇష్టానుసారంగా చెలరేగిపోతున్న జాతి దురహంకార నెతన్యాహు ప్రభుత్వం ఉత్తర గాజాలో గత 24 గంటల్లో ఎడాపెడా దాడులు జరిపింది. ఈ దాడుల్లో 39 మంది పాలస్తీనా పౌరులు మరణించారు. ఇప్పటివరకు మూడు డజన్లకు పైగా మృతదేహాలు ఆసుపత్రికి చేరుకున్నాయని గాజా నగరంలోని అల్- అహ్లీ హాస్పిటల్ డైరక్టర్ ఫాడెల్ నయీమ్ 'అసోసియేటెడ్ ప్రెస్' వార్తా సంస్థకు తెలిపారు. దాడి జరిగిన ప్రదేశంలో కుప్పకూలిన భవన శిథిలాల కింద కూరుకుపోయినవారి కోసం అత్యవసర సహాయక బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. మృతుల సంఖ్య ఇంకా పెరగవచ్చని ఎమర్జెన్సీ గ్రూపు తెలిపింది. దక్షిణ నగరమైన రఫాలో డేరా శిబిరాలపై ఇజ్రాయిల్ సైన్యం జరిపిన దాడిలో 25 మంది చనిపోగా, 50 మందికిపైగా గాయపడ్డారు. గాజాలోని ఏ స్థలం సురక్షితంగా లేదని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. తగినంత ఆహారం, నీరు, మందులు లేక ఆకలిబారిన పడి గత వారం రోజుల్లో నలుగురు చిన్నారులు చనిపోయారు. ఇజ్రాయిల్ దాడుల్లో రెడ్‌క్రాస్ కార్యాలయ భవనం పూర్తిగా దెబ్బతింది. గాజాలో ఆరోగ్య వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని డబ్ల్యుహెచ్ఓ తెలిపింది. ఇజ్రాయిల్ ఉగ్ర దాడుల వల్ల గాజాలో ఏ ప్రాంతం సురక్షితంగా లేదని ఐరాస పేర్కొంది. అమెరికాకు హుటాహుటిన ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఆదివారం బయల్దేరి వెళ్లారు. గాజాలో ఇజ్రాయిల్ సైన్యం దాడులను ఉధృతం చేస్తున్నందున అదనంగా ఆయుధాలు, డబ్బు కావాలని ఇజ్రాయిల్ మంత్రి అమెరికా అధ్యక్షుడ్ని కోరడం కోసమే ఆయన పర్యటన ఉద్దేశమని మీడియా తెలిపింది.

ప్రత్యేక హోదా డిమాండ్‌ను కేంద్రం జాగ్రత్తగా పరిశీలించాలి

- నీతి ఆయోగ్ మాజీ ఛైర్మన్ రాజీవ్ కుమార్

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలు దీర్ఘకాలికంగా డిమాండ్ చేస్తున్న ప్రత్యేక హోదాపై కేంద్ర ప్రభుత్వం జాగ్రత్తగా పరిశీలించాల్సిన అవసరముందని నీతి ఆయోగ్ మాజీ ఛైర్మన్ రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. పిటిఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వివిధ అంశాలపై మాట్లాడారు. ప్రత్యేక హోదా డిమాండ్‌ను పరిశీలించే క్రమంలో తొందర పడవద్దని, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక వనరులపై ఇది తీవ్ర ప్రభావం చూపేవీలున్నందున జాగ్రత్తగా పరిశీలించాలని ఆయన సూచించారు. 2014లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో అప్పటి వరకు ఉన్న రాజధాని హైదరాబాద్‌ను ఆంధ్రప్రదేశ్ కోల్పోవాల్సిరావడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయింది. ఈ నేపథ్యంలో ఆర్థిక లోటు భర్తీ కోసం ఐదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తామంటూ నాడు పార్లమెంటు సాక్షిగా కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ఇచ్చినమాటను నిలబెట్టుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. మరోవైపు బీహార్ కూడా 2005 నుంచి ప్రత్యేక హోదా కోసం డిమాండ్ చేస్తూ వస్తోంది. ప్రస్తుతం అటు బీహార్‌లో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలోని జెడియు, ఇటు ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని టిడిపి కేంద్ర ప్రభుత్వానికి చాలా కీలకంగా మారాయి. కేంద్రంలో బిజెపికి సాధారణ మెజారిటీ రాకపోవడంతో ఈ రెండు పార్టీలపైనే ఎన్‌డిఎ ప్రభుత్వం ఆధారపడాల్సివస్తోంది. ఈ నేపథ్యంలో రాజీవ్ కుమార్ పై వ్యాఖ్యలు చేశారు. 'ప్రత్యేక హోదా అనేది బీహార్, ఆంధ్రప్రదేశ్ దీర్ఘకాలిక డిమాండ్... ఇది చాలా జాగ్రత్తగా పరిశీలించాల్సిన డిమాండ్, ఎందుకంటే ఈ డిమాండ్ ఆధారంగా ఆర్థిక పరిమితులను జాగ్రత్తగా పరిశీలించాలి. ఎందుకంటే తొందరపడి చేస్తే, మిగిలిన ఎన్ని రాష్ట్రాలు ప్రత్యేక హోదా కోసం డిమాండ్ చేస్తాయో తెలియదు. ఆర్థికంగానూ తీవ్ర ఒత్తిళ్లకు గురికావాల్సివుంటుంది' అని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక హోదా లభిస్తే అనేక పన్ను రాయితీలతో పాటు, కేంద్ర ప్రాయోజిత పథకాలకు అయ్యే ఖర్చులో 90 శాతం నిధులను కేంద్రమే సమకూర్చాల్సివుంటుంది. సాధారణ రాష్ట్రాలకు కేంద్రం నుంచి 60 శాతమే నిధులు వస్తాయి. మిగిలిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుంది.

భారత్‌లో పెరుగుతున్న కేన్సర్ కేసులు

న్యూఢిల్లీ : ప్రాసెస్డ్ ఫుడ్, అధిక ఒత్తిడితో కూడిన అనారోగ్యకరమైన జీవన శైలితో భారత్‌లో 40 ఏళ్లలోపు వారిలో కేన్సర్ కేసులను పెంచుతున్నాయని వైద్యులు ఆదివారం పేర్కొన్నారు. కదలకుండా ఎక్కువ సేపు కూర్చుని ఉండటం కూడా భారత్‌లో యువకులు కేన్సర్ బారినపడేలా చేస్తున్నాయని హెచ్చరిస్తున్నారు. ఢిల్లీకి చెందిన కేన్సర్ ముక్త్ భారత్ ఫౌండేషన్ ఇటీవల ఓ సర్వే చేపట్టింది. ఈ సర్వే ప్రకారం భారత్‌లో ప్రస్తుతం 40 ఏళ్లలోపు వారిలో 20 శాతం కేన్సర్ కేసులు నిర్ధారణ అవుతున్నాయని పేర్కొంది. పురుషులు 60 శాతం ఉండగా, మిగిలిన 40 శాతం కేసుల్లో మహిళలు ఉన్నారని తెలిపింది. ప్రాసెస్డ్ ఫుడ్, పొగాకు, ఆల్కహాల్‌ను అధికంగా తీసుకోవడం, ఊబకాయం, ఒత్తిడి, ఎక్కువసేపు కూర్చుని ఉండటం ప్రధాన కారణాలలో ఒకటని పేర్కొన్నారు. వీటికి తోడు పర్యావరణ కాలుష్యం మరో క్లిష్టమైన అంశమని చెప్పారు. భారత్‌లోని పలు నగరాలు అధికస్థాయిలో కాలుష్యంతో నిండిపోయాయని అన్నారు. అనారోగ్యకరమైన, యాడెడ్, ప్రిజర్వేటివ్స్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం, శారీరక శ్రమ లేకపోవడం వంటివి ఆరోగ్యంపై అధిక ప్రభావాన్ని చూపుతున్నాయని ఫోర్టిస్ మెమోరియల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో హెమటాలజీ, బిఎంటి డైరెక్టర్ మరియు హెడ్ డా.రాహుల్ భార్గవ పేర్కొన్నారు. ఈ భయంకరమైన ధోరణిని అరికట్టడానికి ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, చురుకైన జీవన శైలి అత్యవసరమని అన్నారు.

క్యూబాకు మద్దతుగా బ్రిక్స్ రాజకీయ పార్టీలు

వ్లాడివోస్టొవాక్ (రష్యా): క్యూబాపై ఆర్థిక దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని బ్రిక్స్, దాని అనుబంధ దేశాల రాజకీయ పార్టీల ఫోరమ్ డిమాండ్ చేసింది.. బ్రిక్స్, దాని అసోసియేట్ సభ్య దేశాలకు చెందిన 22 రాజకీయ పార్టీల వేదిక 'ఫర్ ది ఫ్రీడమ్ ఆఫ్ నేషన్స్' పేరుతో ఇటీవల మూడు రోజుల పాటు ఇక్కడ సదస్సు నిర్వహించింది. క్యూబాపై అమెరికా ఆర్థిక దిగ్బంధనాన్ని అది ఖండించింది. ఏకపక్ష బలవంతపు ఆంక్షలు చట్ట విరుద్ధమే గాక, ఐక్యరాజ్యసమితి నియమావళిని కూడా ఉల్లంఘించడమేనని ఆ సమావేశం ఆమోదించిన తుది ప్రకటన పేర్కొంది. క్యూబాను ఉగ్రవాద ప్రోత్సాహ దేశాల జాబితా నుంచి తొలగించాలని సదస్సు డిమాండ్ చేసింది. యునైటెడ్ రష్యా పార్టీ చొరవతో ఏర్పాటైన ఈ సదస్సులో క్యూబా కమ్యూనిస్టు పార్టీ కూడా హాజరైంది. భారత్, రష్యా, చైనా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా దేశాలతో కూడిన బ్రిక్స్ కు అనుబంధంగా ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ అరబ్ ఎమిరేట్స్, ఈ జిప్టు, ఇథియోపియా తదితర దేశాలు ఉన్నాయి.



మీకోసం

పచ్చి బఠానీలను ఉడికించేటప్పుడు చిటికెడు పంచదార కలిపితే రంగు మారకుండా ఉంటాయి.

జీవన సౌరభం

జీవిత మార్గంలో ఒక దారి మూసుకుపోయినప్పుడు మరో దారి తెరిచే ఉంటుంది. దానిని గుర్తించి సాగడమే మన కర్తవ్యం.

శిఖరాగ్రం

వానొస్తే వేసుకోరా గొడుగు
వరదొస్తే పొంగేరా మడుగు
తిరగకురా ఎండలో బుడుగు
సాయానికి వేయరా ముందడుగు


కరువొస్తే నాటరా మొక్కలు
గురువొస్తే చెప్పరా వందనాలు
చేయకురా ఎడాపెడా అప్పులు
తెచ్చునురా అవి ఎన్నో తిప్పలు

చెప్పకురా ఎన్నడు నీ గొప్పలు
తగ్గునురా గౌరవ మర్యాదలు
పలకరా చక్కనైన మాటలు
తెలుగు తేనెలూరు ఊటలు

వినరా అమ్మానాన్న మాటలు
కన్నారా వారు పడు కష్టాలు
చదవరా ఉన్నత చదువులు
ఎదగరా అత్యున్నత శిఖరాలు!



- గుండాల నరేంద్రబాబు,
94932 35992.



లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన ఆకృతులను అంకెలుగా గణించి లెక్క చేశాం. మొదటి రెండు వరుసలను బట్టి మూడో వరుస సమాధానం మీరు రాబట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ



- ఉప్పాడ జై దేవ్,
2వ తరగతి,
రైల్వే న్యూ కాలనీ,
విశాఖపట్నం.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జ్వరాల కాలం.. జరభద్రం ...

వర్షాకాలం మొదలైంది. ఓ వైపు ఎండలు కాస్తున్నా... ఇంకోవైపు అడపా దడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో వాతావరణంలో మార్పులు కన్పిస్తున్నాయి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో చెదురు మదురు జల్లులు సైతం కురుస్తున్నాయి. సీజన్ మారే క్రమంలో ఏటేటా మొదట్లో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఎక్కువమంది దగ్గు, జలుబు, విష జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. దగ్గు, జలుబు, గొంతు నొప్పి, కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు, శ్వాసకోశ సమస్యలు, తిన్న ఆహారం జీర్ణంకాక పోవడం వంటివి కూడా సీజనల్ వ్యాధులుగానే చెప్పకోవచ్చు. వర్షాకాలంలో వచ్చే మరి కొన్ని వ్యాధుల్లో ఇన్‌ఫ్లుఎంజా, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ జ్వరంతో పాటు హెపటైటిస్-ఎ ఉన్నాయి. ఈ వ్యాధుల బారిన అన్ని వయస్సుల వారు పడుతుంటారు. కానీ చిన్న పిల్లలు, వృద్ధుల్లో ఈ వ్యాధులతో ఎక్కువ హానీ ఉంటుంది



వైరస్‌ల కాలం

వచ్చిన మార్పులతో చల్లటి వాతావరణం వైరస్‌ల పెరుగుదలకు అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుత సీజన్‌లో వైరల్ ఇన్ఫెక్షన్లు, జ్వరాల ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఒక్కోసారి జ్వరాలు కొన్ని రోజుల పాటు తగ్గకుండా ఇబ్బంది పెడుతుంటాయి. ఒక్కోసారి తీవ్రత కూడా ఎక్కువగా ఉండే ప్రమాదం కూడా ఉంది. జ్వరంతో పాటుగా తీవ్రమైన తలనొప్పి, ఒళ్లునొప్పులు కూడా ఉంటాయి. ఇంకొందరు దద్దుర్లు, దురదలతో కూడా ఇబ్బంది పడుతుంటారు. తినే ఆహారం కలుషితమైన పరిస్థితుల్లో కొందరు వాంతులు, విరేచనాలతో కూడా బాధపడుతుంటారు. దగ్గు, జలుబు, పడిశం వంటివి అందరినీ ఈకాలంలో పట్టి పీడిస్తుంటాయి. విష జ్వరాలతోపాటుగా మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వంటి వ్యాపిస్తుంటాయి.

కలుషిత నీరు, ఆహారమే కారణం

ఈ వ్యాధులు సోకడానికి ప్రధానంగా కలుషిత ఆహారం, మురికి నీరు. ఎక్కువ కాలం ఒకే ప్రాంతంలో నిలిచి ఉన్న మురుగు నీరు.. దానిపై వాలే దోమలు ఈ వ్యాధులకు ప్రధాన కారణం అవుతున్నాయి. అలాగే దగ్గు ద్వారా ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే అవకాశం ఉంది. దోమల వల్ల వ్యాపించే మలేరియా, డెంగ్యూ వంటివి కొన్నిసార్లు ప్రమాదకరమైనవిగా మారతాయి. అందుకే వాటిని ముందుగా గుర్తించి అశ్రద్ధ చేయకుండా చికిత్స చేయించుకోవాలి. టైఫాయిడ్ లేదా కలుషిత ఆహారం వల్ల వికారం, వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి వచ్చే అవకాశం ఉంది. ఇలాంటి లక్షణాలు కనిపించినట్లయితే వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. వైద్యుల సూచనల మేరకు వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

జ్వరం వచ్చినప్పుడు ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించాలి. శరీరం డిహైడ్రేషన్‌కు గురి కాకుండా సరైన మోతాదులో నీటిని తాగాలి. మంచి ఆహారాన్ని తీసుకోవాలి. రోగికి తగినంత విశ్రాంతి ఇవ్వాలి. తేలికపాటి ఆహారం ఇవ్వాలి. ముఖ్యంగా రోగి ఆందోళనకు గురికాకుండా చూసుకోవాలి. డాక్టర్లు సరైన వైద్య పరీక్షలు చేసి ఇచ్చిన మందులను వాడితే తగ్గిపోతాయి.

తడవకుండా ఉండటమే మేలు

వర్షాల్లో కురిసే సమయంలో సాధ్యమైనంత వరకూ తడవకుండా ఉండటమే మేలు. చల్లదనానికి శరీరభాగాలు శక్తిహీనంగా మారిపోయి సూక్ష్మక్రిములు సులువుగా శరీరంలోకి ప్రవేశిస్తాయి. కాబట్టి చల్లదనం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షంలో వెళ్తే గొడుగు, రెయిన్ కోట్స్ తప్పనిసరిగా వాడాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలి. వీలైనంతవరకూ నూనెలు, మసాలాలతో కూడిన ఆహార పదార్థాలను తినటం తగ్గించాలి. గొంతునొప్పి వస్తే గోరు వెచ్చటి నీటిలో ఉప్పు వేసుకొని తరుచూ పుక్కిలించాలి.



- డాక్టర్ పి.శివశంకర్,
వైద్యాధికారి,
కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,
పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా.

కొత్త స్నేహితుల ఊసులు చెప్పండి

పిల్లలు కొత్త స్కూళ్లలోకి, కొత్త తరగతుల్లోకి మారుతున్న సమయం ఇది. ఇప్పుడే కొత్త స్నేహితులు పరిచయం అవుతారు. వారితో స్నేహం ఏర్పడితినే ప్రతిరోజూ స్కూలుకు వెళ్లాలనిపిస్తుంది. స్నేహితులు లేని పిల్లలు స్కూలుకు వెళ్లేందుకు పెద్దగా ఆసక్తి చూపరు. పాఠాలు కూడా శ్రద్ధగా వినరు. ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే స్కూలు వాతావరణం, స్నేహితుల సహకారం గురించి పిల్లలకు తెలిసేలా చేయాలి.



- పాత స్కూలు, పాత స్నేహితులు ఉండరని బెంగపడకుండా ముందుగానే వారిలో ఉత్సాహం కలిగించే మాటలు చెప్పాలి.
- కొత్తవాళ్లను చిరునవ్వుతో పలకరించాలని చెప్పాలి. మాట్లాడేటప్పుడు చిన్న నవ్వు నవ్వితే స్నేహానికి మొదటి అడుగులా ఉంటుంది.
- తెలియని వారు, కొత్త పిల్లలు అని వారి పక్కన కూర్చోకుండా దూరంగా వెళ్లకూడదు. అందరితో కలిసిమెలిసి ఉండాలని చెప్పాలి.
- స్నేహం ఏర్పడుతున్న మొదట్లో ఎదుటివారు ఏం చెబుతున్నారో పూర్తిగా వినాలి. ఆ తర్వాతే మాట్లాడమనాలి.
- కొత్త స్నేహితులతో కలిసి ఆటల్లో పాల్గొనమని చెప్పాలి. ఓడినా...గెలిచినా స్ఫూర్తిగా తీసుకోమనాలి.
- పిల్లలు చాలా తక్కువ సమయంలోనే స్నేహితులను ఏర్పాటు చేసుకుంటారు. వారిలో సున్నిత మనస్కులు, అల్లరి పిల్లలూ ఉంటారు. ఇక్కడే పిల్లలు ఎవరితో ఎక్కువ సమయం గడుపుతున్నారో తల్లిదండ్రులు పట్టించుకోవాలి.
- అల్లరి పనులు చేసే పిల్లలకు దూరంగా ఉండాలని అసలు చెప్పొద్దు. ఆ పనుల వల్ల కలిగే అనర్థాలను పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలి. అవసరమైతే వాళ్ల స్నేహితులకు కూడా చెప్పమనాలి.
- స్నేహితుల మధ్య ఏవైనా పొరపాట్లు, తప్పులు జరిగితే నొప్పించే మాటలు మాట్లాడకూడదని చెప్పాలి.
- స్నేహితులకు ఎప్పుడూ దూరం జరగమని చెప్పకూడదు. కలిసిమెలిసి ఉండాలనే చెప్పాలి. అప్పుడే పిల్లల్లో స్నేహం పట్ల, స్నేహితుల పట్ల సానుకూల దృక్పథం ఏర్పడుతుంది. భవిష్యత్తులో ఒంటరితనానికి గురవ్వకుండా ఉంటారు.

సినిమాల్లో సరికొత్త 'ప్రపంచాలు'


అద్భుతమైన కల్పనతో ఊహాలోకాలు సృష్టించటం, కాలాన్ని వెనక్కు, ముందుకు నడిపించి కథలు అల్లటం సినీ ప్రపంచంలో మామూలే! చిరంజీవి నటించిన 'జగదేకవీరుడు.. అతిలోక సుందరి', 'యముడికి మొగుడు', సీనియర్ ఎన్‌టిఆర్ నటించిన 'యమగోల', జూనియర్ ఎన్‌టిఆర్ నటించిన 'యమదొంగ', ఆలీ నటించిన 'యమగోల', నాగార్జున నటించిన 'బంగార్రాజు' తదితర చిత్రాలు ఆ కోవలోకే వస్తాయి. తెలుగు సినిమా ప్రారంభంలో ఎన్‌టిఆర్, ఎఎన్ఆర్, శోభన్‌బాబు, కృష్ణ తదితరులు నటించిన సినిమాల్లో దేవుడి ప్రాధాన్యతలపై కొత్తగా పాత్రలను సృష్టించేవారు. ఇప్పుడు వాళ్లు లేకపోయినా వారి రూపాలతో ఏఐ చిత్రాలు హల్‌చల్ చేస్తున్నాయి.

కాలాన్ని ప్రామాణికంగా ...

కాలాన్ని ప్రామాణికంగా తీసుకుని చాలా కాలంగా సినిమాలు వస్తున్నాయి. ఇప్పుడున్న కాలానికి వెనక ఏం జరిగిందో, భవిష్యత్తులో ఏం జరగబోతుందో తెలుసుకోవాలన్న ఆసక్తి సహజంగానే ప్రేక్షకుల్లో ఉంటుంది. ఆ ఆసక్తి సినిమా కథలకు గొప్ప ముడి సరుకు. కాలాన్ని ఒక కొలమానంగా తీసుకొని అనేక కథలు వెండితెరపై అలరించాయి. తాజాగా 'కల్కి 2898' సినిమా కథ కాశీ, కాంప్లెక్స్, శంబాలా అనే మూడు సరికొత్త ప్రపంచాల మధ్య సాగుతుందని దర్శకుడు నాగ్‌అశ్విన్ వెల్లడించారు. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ దర్శకత్వంలో రూపొందిన సైన్స్ ఫిక్షన్ కథ ఇది. రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు ఈ సినిమా రానుంది. పార్ట్-1 ఈనెల 27న విడుదల కానుంది.

నాగఅశ్విన్ వివరించినట్టు 'మూడు ప్రపంచాల మధ్య జరిగే కథ కల్కి. గంగానది ఒడ్డునున్న కాశీ లేదా వారణాసి ఈ ప్రపంచంలోనే మొదటి నగరమని ప్రచారం ఉంది. అలాకాకుండా ఈ ప్రపంచంలో కాశీనే చివరి నగరమైతే ఎలా ఉంటుందన్న ఆలోచనతో ఈ కథను రూపొందించాం. ఈ కథలో జీవనది గంగా ఎండిపోవటంతో కాశీ ప్రజలు దుర్భర జీవితాన్ని అనుభవిస్తుంటారు. అదే సమయంలో తిరగేసిన పిరమిడ్ ఆకారంలో ఉండే ప్రదేశమే కాంప్లెక్స్. ఆకాశంలో కిలోమీటరు మేర పై భాగంలో ఉంటుంది. అక్కడ లభించని వస్తువంటూ ఏదీ ఉండదు. నీరు, ఆహారం, పచ్చదనం ఇలా అన్నీ అక్కడ అందుబాటులో ఉంటాయి. కాశీ ప్రజలు ఎప్పటికైనా కాంప్లెక్స్‌కు వెళ్లి అక్కడ ఉన్నవన్నీ ఆస్వాదించాలనుకుంటారు. అయితే కొందరు ఆ ప్రయత్నాన్ని నియంత్రిస్తుంటారు. కాశీ, కాంప్లెక్స్‌తోపాటుగా శంబాలా అనే మరో ప్రపంచం కూడా ఉంది. ఈ మూడు ప్రపంచాలు ఒకదానితో మరొకటి అనుసంధానమవుతూ 'కల్కి' కథ నడుస్తుంది. ఈ మూడు ప్రపంచాల్లోని ప్రజలు, వారి ఆచార వ్యవహారాలు, ఆధిపత్య పోరాటం ఈ కథలో ఉంటాయి.'






ఆదిత్య 369 నుంచే మొదలు

గతంలో హీరో బాలకృష్ణ నటించిన 'ఆదిత్య 369' సినిమా సైంటిఫిక్ మ్యూజికల్‌గా నిలిచింది. 33 ఏళ్ల క్రితం సింగీతం శ్రీనివాస్‌రావు తెరకెక్కించేవరకు తెలుగులో సైంటిఫిక్ సినిమాలు అంతగా రాలేదు. పైగా టైమ్ మిషన్ నేపథ్యంలో వచ్చిన ఈ సినిమా అద్భుత విజయం సాధించింది. 'కల్కి 2898'లో బుజ్జి వాహనం కూడా సరికొత్తగా నిలిచింది. హాలీవుడ్‌లో మ్యాడ్‌మ్యాక్స్ సినిమాలో కూడా బుజ్జి లాంటి వాహనాన్నే వినియోగించి రక్తపాతం చేస్తుంటారు. మొదట్లో విఠలాచార్య దర్శకత్వంలో వచ్చిన సినిమాలు ఊహకు అందని రీతిలో అనేక జిమ్మిక్కులతో అబ్బురపరిచేవి. అక్కినేని నటించిన 'కీలుగుర్రం', ఎన్టీఆర్ 'భువనసుందరి కథ' నుంచి బాలకృష్ణ 'భైరవ దీపం' వరకూ ఇప్పటి ఏఐకి దీటుగా నిర్మించినవే.

భవిష్యత్తుపై ఊహల కథలు

భవిష్యత్తు ఎలా వుంటుందో మనకు తెలియదు. కానీ... ఇలా వుండొచ్చంటూ వీక్షకులు భావించేలా హిందీ, ఇంగ్లీషు సినిమాలు చాలానే వచ్చాయి. హృతిక్ రోషన్ 'క్రిష్' సినిమా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. తెలుగులో అద్భుతం, 24, సెవెన్త్‌సెన్స్ సినిమాలు బాగా ప్రజాదరణ పొందాయి. సాంకేతికతకు ఊహాశక్తిని ఎంత జోడించినా... వినోదాత్మకంగా వుండాలే తప్ప వాస్తవికతను తప్పుదోవ పట్టించేవిధంగా వుండకూడదు. అప్పుడే ప్రేక్షకులు ఆదరిస్తారు. అభూత కల్పనలకు చాందసాన్ని జోడిస్తే ఆ సినిమాలు పెద్దగా రాణించిన దాఖలాలు లేవు.



ఆఫ్ఘన్ అద్భుత విజయం

- **సూపర్8లో ఆస్ట్రేలియాపై 21 రన్స్‌తో గెలుపు**
- **ఐసిసి 2024 టి20 ప్రపంచకప్**
- **ఏడు వికెట్లతో నిప్పులు చెరిగిన నయిబ్, నవీన్**

ఆఫ్ఘనిస్థాన్ అదరగొట్టింది. అగ్రజట్టు, మాజీ ఛాంపియన్ ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. బ్యాట్‌తో, బంతితో, ఫీల్డింగ్‌లోనూ కంగారూలపై తిరుగులేని పైచేయి సాధించింది. ఆఫ్ఘన్ పేసర్లు గుల్బాదిన్ నయిబ్ (4/20), నవీన్ ఉల్ హక్ (3/20) నిప్పులు చెరగటంతో 149 పరుగుల ఛేదనలో ఆస్ట్రేలియా చేతులెత్తేసింది. 19.2 ఓవర్లలో 127 పరుగులకే కుప్పకూలింది. 21 పరుగుల తేడాతో ఆఫ్ఘనిస్థాన్ సూపర్ విక్టరీ నమోదు చేసింది. ఈ విజయంతో సెమీఫైనల్ ఆశలను ఆఫ్ఘన్ సజీవంగా నిలుపుకోగా.. ఆస్ట్రేలియా అవకాశాలను దారుణంగా దెబ్బతీసింది.



కింగ్స్‌టౌన్ : అగ్రజట్టు ఆస్ట్రేలియాపై ఆఫ్ఘనిస్థాన్ అద్భుత సాధించింది. ఐసిసి టి20 ప్రపంచకప్ సూపర్8 దశ గ్రూప్-1 మ్యాచ్‌లో ఆదివారం కింగ్స్‌టౌన్‌లో ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. 148 పరుగుల స్కోరును విజయవంతంగా కాపాడుకున్న ఆఫ్ఘనిస్థాన్ 21 పరుగుల తేడాతో మెరుపు విజయం నమోదు చేసింది. ఛేదనలో ఆసీస్ ఆల్‌రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్ (59, 41 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో పోరాడినా.. ఫలితం దక్కలేదు. ట్రావిశ్ హెడ్ (0), డెవిడ్ వార్నర్ (3), మిచెల్ మార్ష్ (12), టిమ్ డెవిడ్ (2), మార్కస్ స్టోయినిస్ (11) విఫలమయ్యారు. ఆఫ్ఘన్ పేసర్లు నయిబ్, నవీన్ 8 ఓవర్లలో 40 పరుగులకే ఏడు వికెట్లు పడగొట్టి ఆసీస్ పతనాన్ని శాసించారు. అంతకుముందు ఓపెనర్లు రహ్మనుల్లా గుర్బాజ్ (60, 49 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), ఇబ్రహీం జద్రాన్ (51, 48 బంతుల్లో 6 ఫోర్లు) అర్ధ సెంచరీలతో తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 148 పరుగులు చేసింది. ఆసీస్ పేసర్ పాట్ కమిన్స్ (3/28) వరుసగా రెండో మ్యాచ్‌లో హ్యాట్రిక్ వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. ఆఫ్ఘన్ పేసర్ గుల్బాదిన్ నయిబ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

మాక్స్‌వెల్ పోరాడినా.. : 149 పరుగుల ఛేదనలో ఆస్ట్రేలియా చతికిల పడింది. పవర్‌ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో కూరుకుంది. ట్రావిశ్ హెడ్ (0), డెవిడ్ వార్నర్ (3), మిచెల్ మార్ష్ (12) విఫలమయ్యారు. నవీన్, నబిలు పవర్‌ప్లేలో ఆసీస్‌ను కోలుకోలేని దెబ్బకొట్టారు. గ్లెన్ మాక్స్‌వెల్ (59) ఓ ఎండ్‌లో ఒంటరి పోరాటం సాగించాడు. సహచరుల మద్దతు కొరవడినా పరుగుల వేటలో దూసుకెళ్లాడు. మాక్స్‌వెల్ క్రీజులో ఉండగా ఆసీస్ మ్యాచ్ రేసులో నిలిచింది. మిడిల్ ఓవర్లలో బంతి అందుకున్న గుల్బాదిన్ నయిబ్.. మ్యాచ్ గమనాన్ని శాసించాడు. నాలుగు వికెట్ల ప్రదర్శనతో ఆసీస్ ఆశలను ఆవిరి చేశాడు. మాక్స్‌వెల్, స్టోయినిస్ (11), టిమ్ డెవిడ్ (2), పాట్ కమిన్స్ (3)లను అవుట్ చేసిన నయిబ్ అఫ్గాన్ విజయానికి బాటలు వేశాడు. స్లో బాల్స్‌తో మ్యాజిక్ చేసిన నయిబ్, నవీన్‌లు ఆసీస్ బ్యాటర్ల ఆట కట్టించారు. 19.2 ఓవర్లలోనే పది వికెట్లు కోల్పోయిన ఆసీస్ 127 పరుగులే చేసింది.

ఓపెనర్ల దూకుడు : టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన ఆఫ్ఘనిస్థాన్‌కు ఓపెనర్లు మంచి స్కోరు అందించారు. రహ్మనుల్లా గుర్బాజ్ (60), ఇబ్రహీం జద్రాన్ (51) అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. ఆసీస్ పేసర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్న గుర్బాజ్, ఇబ్రహీం 15.5 ఓవర్లలో తొలి వికెట్‌కు 118 పరుగుల సెంచరీ భాగస్వామ్యం అందించారు. నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 44 బంతుల్లో గుర్బాజ్ అర్ధ సెంచరీ సాధించగా.. ఆరు ఫోర్లతో 46 బంతుల్లో ఇబ్రహీం ఫిఫ్టీ మార్క్ చేరుకున్నాడు. ఓపెనర్లు స్వల్ప విరామంలో నిష్క్రమించగా.. డెత్ ఓవర్లలో ఆఫ్ఘన్ ఆశించిన స్కోరు చేయలేదు. కరీం జనత్ (13), అజ్మతుల్లా (2), రషీద్ ఖాన్ (2) నిరాశపరిచారు. మహ్మద్ నబి (10 నాటౌట్) చివర్లో రెండు బౌండరీలతో మెరిశాడు. ఆసీస్ పేసర్ పాట్ కమిన్స్ వరుసగా రెండో మ్యాచ్‌లో హ్యాట్రిక్ వికెట్లు పడగొట్టాడు. రషీద్ ఖాన్, కరీం జనత్, గుల్బాదిన్ నయిబ్‌లను అవుట్ చేసి టీ20 వరల్డ్‌కప్‌లో రెండో హ్యాట్రిక్ నమోదు చేశాడు. 20 ఓవర్లలో 6 వికెట్లకు ఆఫ్ఘన్ 148 పరుగులు చేసింది. స్పిన్నర్ ఆడం జంపా (2/28) ఆకట్టుకున్నాడు.

సంక్షిప్త స్కోర్లు :

ఆఫ్ఘనిస్థాన్ : 148/6 (గుర్బాజ్ 60, ఇబ్రహీం 51, పాట్ కమిన్స్ 3/28, ఆడం జంపా 2/28)

ఆస్ట్రేలియా : 127/10 (మాక్స్‌వెల్ 59, గుల్బాదిన్ నయిబ్ 4/20, నవీన్ ఉల్ హక్ 3/20)

ఆ ఇద్దరు మెరిసేనా?

- **నేడు ఆసిస్‌తో భారత్ పోరు**
- **కఠిన సవాల్‌కు సిద్ధమైన రోహిత్‌సేన**
- **కంగారూలకు ఇక చావోరేవో**
- **రాత్రి 8 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..**
- **ఐసిసి 2024 టి20 ప్రపంచకప్**

సూపర్8 దశ అంతిమ ఘట్టానికి చేరుకుంది. వరుస మ్యాచుల్లో విజయాలు సాధించిన భారత్.. నేడు చివరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో తలపడనుంది. ఆఫ్ఘన్ చేతిలో ఓటమితో ఆసిస్ సెమీస్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. నేడు భారత్‌తో మ్యాచ్‌లో నెగ్గితేనే ఆ జట్టు నిలుస్తుంది. ఒత్తిడి లేకుండా బరిలోకి దిగుతున్న టీమ్ ఇండియాకు ఫలితంపై పెద్దగా ఆందోళన లేదు కాదు. కానీ స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ ఫామ్ తలనొప్పిగా మారుతోంది. గ్రాస్‌ఐలెట్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా సూపర్8 సమరం నేడు.

కోహ్లి, రోహిత్ రాణించేనా?

గ్రాస్‌ఐలెట్ : వరుస విజయాల ఊపుమీదున్న భారత్‌కు కీలక ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ ఫామ్ ఆందోళనగా మారింది. గ్రూప్ దశలో కోహ్లి పూర్తిగా నిరాశపరిచినా.. రోహిత్ ఓ అర్ధ సెంచరీతో మెరిశాడు. సూపర్8లో దంచికొడ్తారని అనుకుంటే ఇక్కడా ఇద్దరూ విఫలమవుతున్నారు. దీంతో ఓవర్లో తొలి నాలుగు బంతులు బౌండరీ దాటినా.. చివరి రెండు బంతులను సైతం భారీ షాట్లు ఆడేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే రోహిత్, కోహ్లి వికెట్ పారేసుకుంటున్నారు. సహజ శైలిలో ఆడుతూనే దండిగా పరుగులు రాబట్టే ప్రణాళిక ఈ ఇద్దరు తక్షణమే ఆలోచన చేయాలి. లేదంటే, కీలక సెమీఫైనల్ ముంగిట కోహ్లి, రోహిత్ భారత్‌కు బలహీనతగా మారే ప్రమాదం లేకపోలేదు. ఇక మిడిల్ ఆర్డర్ గొప్పగా కనిపిస్తోంది. రిషబ్ పంత్, సూర్యకుమార్, శివం దూబె, పాండ్య ఫామ్‌లో ఉన్నారు. రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్‌లు బ్యాట్‌తో సత్తా చాటేందుకు ఎదురుచూస్తున్నారు. బౌలింగ్ విభాగంలో కుల్దీప్ యాదవ్ చేరిక వైవిధ్యత తీసుకొచ్చింది. కుల్దీప్ మాయ, బుమ్రా పేస్ ప్రత్యర్థులను హడలెత్తిస్తోంది.

తుది జట్లు (అంచనా) :

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), విరాట్ కోహ్లి, రిషబ్ పంత్, సూర్యకుమార్ యాదవ్, శివం దూబె, హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, అర్షదీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా.

ఆస్ట్రేలియా : ట్రావిశ్ హెడ్, వార్నర్, మిచెల్ మార్ష్ (కెప్టెన్), మాక్స్‌వెల్, మార్కస్ స్టోయినిస్, టిమ్ డెవిడ్, మాథ్యూ వేడ్, పాట్ కమిన్స్, ఆష్టన్ ఆగర్, జంపా, హాజిల్‌వుడ్.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68